# దైవం మానుష రూపేణ

## సద్గురు శ్రీశ్రీశ్రీ దర్గాస్వామివారి

## జీవిత చరిత్ర

(రెండవ భాగము)

నీలకంఠరావు పేట, కడప జిల్లా.

సేకరణ :- పెసల సుబ్బరామయ్య

# సద్గురు శ్రీ దర్గాస్వామి మహరాజ్!

ఈ మహనీయుడు మనందరిలాగే మానవ రూపంలో ఉండి, ఒకప్పుడు మనలాగానే అన్నం తిన్నారు. అమ్మయ్యగారిని వివాహమాడారు. కాని ప్రస్తుతం రోజుకొక గ్లాసు ఆవుపాలుగాని లేక కొబ్బరి కాయ నీళ్ళుగాని తీసుకుంటూ మనకంటే ఎక్కువ హుషారుగా ఉంటారు. లోకంలో మానవ మాత్రులు చేయలేని గొప్ప పనులు చేశారు.

కాంతా కనకములను పూర్తిగా వదిలేశారు. వీరి తండ్రిగారు పెద్ద లక్షాదికారి. బంగారంగడి ఉండేది. అమ్మయ్యగారు జమిందారి కుటుంబానికి చెందినవారు. ఈమె ఒక్కరే బిడ్డ అయినందున చాలా గారాబంగా చాకారు. శ్రీ దర్గాస్వామి వారిని వివాహమాడాక శ్రీ స్వామివారు తన ఆస్థిని అమ్మయ్యగారి ఆస్థిని యావత్తు దాన ధర్మాలకు వినియోగించి రిక్తహస్తాలతో నిలిచారు. ఇదంతా కనకము విసర్జించుట అవుతుంది. ఇక కాంతా విసర్జనము --

వధూవరుల జీవితంలో మరుపురాని మొదటి రాత్రి కొద్ది గంటలలో రాబోతుంది. రెక్కలు గలిగిన దేవధూత వచ్చి నీ భార్యతో శారీరక సంభందం శాశ్వతంగా నిషేదిస్తూ పై వాళ్ళు ఆజ్ఞాపించారు. అది నీకు చెప్పడానికే వచ్చాను అని అన్నాడు. భలేవాడివయ్యా! నేనంగీకరించినా ఆమె ఎంతగా నిరాశ చెందుతుందీవార్త విని అని శ్రీ దర్గాస్వామి వారంటే ఆమె హనుమంతుని అంశావతారం. ఆమెనడిగి చూడు అన్నాడు దేవధూత. ఆమెగారినడిగితే అంతకంటే మహాభాగ్యమా అని అన్నారు. నాటి నుండి తల్లీ బిడ్డల వలె ఒకే చోట, ఒకే ఇంట్లో జీవితాంతం నివసించడం మానవ మాత్రులకు వీలుకాదు. అదీ ఒంటరిగా. ఏకాంతమున ప్రియురాలిని గాంచి మాతృభావమునగని మరలు వాడే రఘునుడు అన్నారు పెద్దలు.



శ్రీ రామకృష్ణ పరమ హంసగారు, శారదాదేవిగారు అలా ఒకే చోట ఉన్నారు గదా అని మీరనవచ్చు. శ్రీ శారదా మాత గారు పరమహంస దగ్గరకు వచ్చే సరికే పరమహంసగారికి అమ్మదర్శనమై పిచ్చివాడనే పేరుతో విరాజిల్లుచున్నారు. ఇక్కడ శ్రీ దర్గాస్వామివారు కొన్ని క్షణాలలో మధురమైన మొదటి రాత్రికి సిద్ధమైయున్న సమయములో దేవధూత రావడం శాశ్వతంగా భార్యను తల్లిగా ఆరాధించుటకు ప్రారంభం కావడం జరిగింది. ఇది మానవ మాత్రులు చేయలేని త్యాగం. అందుకే వారు దైవం మానుష రూపేణ అయినారు.

ఇంతకు ముందు విడుదలైన పుస్తకములో దైవానికి చెప్పబడిన మూడు లక్షణాలు -- సర్వ వ్యాపకత్వము, సర్వజ్ఞత్వము, సర్వసమర్ధత్వమునకు సంబందించిన లీలలు చూచాము. ఇప్పుడు మరికొన్ని దివ్యలీలలు చూస్తాము. ఇంతేగాక వారి దివ్యబోధలు కూడా చూస్తాం.

## సద్గురు శ్రీ దర్గాస్వామి వారితో నా దివ్యానుభవాలు:

2001 వ సంవత్సరంలో గొలగమూడిలోని శ్రీ బ్రహ్మంగారి మఠం పునరుద్ధరించే పని శ్రీ వెంకయ్యస్వామి వారు నాకు అనుగ్రహించారు. అది ఆ మహనీయుని యొక్క పవిత్రసేవ అని వారి ఆదేశాన్ని తప్పక పాటించాలని తెలుస్తూ ఉంది. కానీ నాలోని హీన సంస్కారాలు, అంటే పిసినిగొట్టుతనం, ధనవ్యామోహంలాంటివి ఆ సేవను చక్కగా చేయకుండా అడ్డుపడుతున్నాయి. ఒక భక్తుడిచ్చిన డబ్బుతో పడిపోయిన పూరిపాకను తిరిగి అదే సామానుతో కప్పించాలనుకున్నాను. తాటాకు కూడా తెచ్చిపెట్టాను. శ్రీ స్వామివారు నా మనసుమార్చారు. ఈ తాటాకు పని ప్రతి సంవత్సరమూ కష్టమే. ఇంకొక వెయ్యిగాని రెండు వేలుగాని సొంతంగానైనా ఖర్చుపెట్టి మూడు సిమెంటు రేకులు వేస్తే ఇక ఎప్పటికీ పని

ఉండదని 3 మీటర్ల సిమెంటు రేకులు మూడు తెప్పించాను. నాలుగు మూలలలో కంకర, సిమెంటు, కమ్ములతో చేసిన నాలుగు స్థంబాలు నాటి చుట్టూ 4 అంగుళాల గోడ సగం పెట్టించాను.

ఆ సమయంలో సద్గురు శ్రీ దర్గాస్వామి వారు గొలగమూడి విచ్చేశారు. ఆ మహనీయుడు తన పాదస్పర్శతో పవిత్రం చేస్తే ఈ బ్రహ్మంగారి మఠం పని పూర్తవుతుందని ఈ మహనీయుని అర్థించి మఠనిర్మాణ స్థలానికి తీసుకువచ్చాను. ఆ మహనీయుడు తలా ఒక పువ్వు వేస్తే పూలమాల అవుతుంది. నీవు సిమెంటు రేకులుగాకుండా స్లాబే వేయమని ఆదేశించారు. స్లాబువేయడమంటే డబ్బు కావాలిగదా స్వామీ, నేనందుకు చాలను అని విన్నవించాను. బ్రహ్మంగారే డబ్బు పంపుతారు. ఆరు కమ్ములు, పది బస్తాల సిమెంటు సరిపోతుంది. స్లాబు వేయించు, అని చెప్పి వెళ్ళిపోయారు. నాకు పచ్చి వెలక్కాయ గొంతున పడినట్లయింది.

ఆ మహనీయుడు చెప్పినట్లు చేసేందుకు నాకు తెంపురాదు. వారు ఆజ్ఞాపించారు గనుక చేయకుండా ఉండలేను. కనీసం నెల రోజులు పని ఆపి ఆలోచిస్తున్నాను. ఈలోగా నేను పని చేయించని విషయం శ్రీ స్వామి వారికి తెలిసే గాబోలు పని ఎంత వరకు వచ్చింది అని గొలగమూడి నుండి వెళ్ళిన భక్తులను నాలుగుసార్లు అడిగారు. వేసవి కాలమైనందున బ్రహ్మంగారి బావి ఎండి పోయింది. నేను పనిచేయించక పోవుటకు కారణం దొరికింది. వెంటనే శ్రీ స్వామి వారికి బావి ఎండిపోయిన సంగతి లెటరు వ్రాసి నీరు వస్తే పని చూస్తామని తెలిపాను.

ఆ మహనీయునకు నా ఆత్మలోని బాధ తెలియకపోలేదు. క్యాన్సరు వ్యాధిని శ్రీ స్వామి వారి ఆశీస్సులతో పోగొట్టుకున్నవారు వారికి కృతజ్ఞతలు తెలిపేందుకు నీలకంఠరావుపేట పోతే గొలగమూడిలో నిర్మించే



బ్రహ్మంగారి మఠం చూసి వెళ్ళమన్నారు. ఆ భక్తుడిక్కడికి వచ్చి నా బాధంతా విని "సార్ ఏమైనాసరే మీరు శ్రీ స్వామి వారు చెప్పినట్లే చేయండి. దానికవసరమైన కమ్మి, సిమెంటు నేనిస్తానన్నాడు" సరేనన్నాను. వారు 60 కమ్ములు, 30 బస్తాల సిమెంటు పంపారు.

మరొకభక్తుడు ఫలానారోజు నా యింటికి స్లాబు వేస్తున్నాను. ఆ రోజే బ్రహ్మంగారి మఠానికి గూడా స్లాబువేయాలని పట్టుబట్టి పని జరిపించారు. మంచి వేసవి, బావిలో చుక్క నీరులేవు. ఆ భక్తుడు 300 గజాలకు పైన రబ్బరు పైపులు జాయింట్ చేసి స్లాబుకే కాకుండా క్యూరింగుకు కూడా నీళ్ళ సప్లైచేశాడు.

ఈలోగా నా అభ్యర్ధనలేకుండానే అనేక మంది భక్తుల సహకారంతో మఠం మాత్రమే గాకుండా పూజారికి రెండు రూములు సిమెంటు రేకులతో వేశాము. చుట్టూ ప్రహరిగోడ, గేటు ఏర్పడ్డాయి. ఒక భక్తుడు 5 అడుగుల శ్రీ బ్రహ్మంగారి పటమిచ్చాడు. మఠం పైన కలశం పెట్టాలి. ఒకరి ద్వారా ఆర్డరిచ్చి డబ్బు ఇస్తానన్నాను. చిత్రంగా ఆ వ్యక్తి ఆ కలశం ఖర్చు తానేభరించాడు. 26-11-2001 నాడు సద్గురు శ్రీ దర్గా బాబాగారి కరకమలములతో మఠ ప్రారంభోత్సవం దివ్యంగా జరిగింది.

ఇంతటి పని నేను చేయిస్తానని కలలో కూడ అనుకోలేదు. వారి దివ్య ఆశీస్సులే ఈ కార్యమంతా చేయించింది.

## సద్గురు శ్రీ దర్గాస్వామి వారితో నా ప్రథమ అనుభవం:

2001 వ సంవత్సరము వరకు వివిధ భక్తుల అనుభవాలు వినడం తప్ప స్వయంగా నాకేఅనుభవాలు లేవు. 2001 వ సంవత్సరములో గొలగమూడిలో శ్రీ బ్రహ్మంగారి మఠం పునరుద్దరించే పని శ్రీ వెంకయ్య

స్వామి వారు నాకు ప్రసాదించారు. శ్రీ దర్గా స్వామి వారు ఆ పవిత్ర ప్రదేశానికి వచ్చి - "డబ్బు అయనే తెప్పించు కుంటారు నీవు స్లాబు వేయి, సిమెంటు రేకులు వద్దు" అని అన్నారు. ఈ పనికిగాను నాకు తెలిసిన ఒక పెద్ద మనిషిని చందా అడగాలని వెళ్ళాను. వెంటనే అయన "మందిరాన్ని కట్టిస్తారు, దీపాలు పెట్టే దిక్కు ఉండరు. కట్టించటం కాదు ఆ తరువాత నిర్వహణ సమస్య" అని అన్నారు. నేను వెంటనే ఆయనను అడగకుండా వచ్చేశాను. ఆ ప్రక్క రోజు నుండి శ్రీ దర్గా స్వామి వారు నీలకంఠరావు పేట నుండి నాలుగు మార్లు నలుగురు చేత చెప్పి పంపారు. "దీపం పెట్టే దిక్కు ఉండదు అని అన్నారు. అది ఎలా పెట్టరో చూస్తాను, పని త్వరగా కానిమ్మని చెప్పు" అని చెప్పి పంపారు. నేను, స్వామి వారిని కలవలేదు. ఆ మాట అన్న పెద్ద మనిషి వారికి ఆ మాట తాను అన్నట్లు చెప్పరు. మరి వారికి ఆ మాట ఎట్లా తెలిసింది? వారు సర్వాంతర్యామి కానిదే అలా చెప్పలేరు కదా!

### మరొక అనుభవం:

నన్ను వారు బ్రహ్మం గారి మఠానికి రసీదు పుస్తకాలు అచ్చు వేయించమన్నారు. కాని నా మనస్సులో ఇష్టం లేదు. ఎందుకు అంటే కొంత మంది రసీదు పుస్తకాలు తీసుకు వెళ్ళి తిరిగి తెచ్చి ఇవ్వరు. ఇది శ్రీ వెంకయ్య స్వామి వారి ఆశ్రమంలో నాకు అనుభవం. శ్రీ దర్గా స్వామి వారు గొలగమూడి వస్తూనే నాతో మొదట పలికిన మాట "రసీదు పుస్తకాలు వేయించు, అవి తిరిగి రాకుంటే నాది భాద్యత" అని అన్నారు. ఇది నా మనసులోని అనుమానానికి సమాధానం. వారు సర్వ భూత హృదయాంతర్వక్తి కానిదే నా మనసులోని అనుమానం తెలుసుకోలేరు.



**K. V. రంగారావు గారు ఒంగోలు, శ్రీ దర్గాస్వామివారితో వారికి గల అనుభవాలు ఇలా వివరిస్తున్నారు:**

(1) మాష్టారు గారి శిష్యులు కడప రామచంద్రయ్యగారు నన్ను వారి దర్శనానికి రమ్మన్నారు. నేను, “ఆచార్యుల వారు వారిని చూడలేదు కదా!” వద్దులే అన్నాను. కాదు రండి, వూరికే చూద్దాము అని అన్నారు. సరే నేను వారిని దర్శించటం మాష్టారుగారికి ఇష్టమయితే వారే నాకు దక్షణ ఇవ్వాలి అని మనస్సులో చెప్పుకొని వెళ్ళాను. దారి పొడుగున ఈయన మహాత్ముడా, సిద్ధుడా, జ్ఞానా అని ఇదే నా ఆలోచన. అక్కడ నన్ను చూస్తూనే ఓహో రంగనాయకమ్మకి కొడుకా, అని పిలిచారు. "మా ఆవిడ పేరు కూడా రంగనాయకమ్మ". తరువాత అందరు దక్షిణ ఇచ్చారు. నేను ఇవ్వలేదు. వారే నాకు ఐదు రూపాయలు దక్షిణ ఇచ్చి ఇది నీ గురుప్రసాదం అని అన్నారు. ఈ సన్నివేశంతో నాకు వారి పై గురుత్వం ఏర్పడింది.

(2) రంగారావుగారి పెద్ద అమ్మాయి శ్రీ దర్గా స్వామి వారు చెప్పిన సంబంధమే వివాహం చేసుకుంటాను అని పట్టు పట్టింది, తరువాత వరుడు పెండ్లిచూపుల సందర్భంలో ఆ అమ్మాయిని "షిరిడి హారతులు నాలుగు వచ్చునా అని" అడగగా ఆ అమ్మాయి నాకు ఒకటే వచ్చు అని సమాధానం చెప్పినదట. తరువాత వారు అడిగిన కట్నం ఇచ్చి పెండ్లి చేయుట కష్టం అని రంగారావు గారు సందేహించి శ్రీ స్వామి వద్దకు వెళ్ళగా శ్రీ దర్గా స్వామి వారు, పెండ్లి కొడుకు పలికిన మాటలు "షిరిడి హారతులు వచ్చునా అని అడిగినట్లు, వారి అమ్మాయి ఒకటే వచ్చు అని చెప్పినట్లు" చెప్పి ఆ సంబంధమునే నిశ్చయించి చేయమన్నారట. వరుడు కడప నివాసి. శ్రీ స్వామి వారికి దగ్గర వూరు. తరువాత కట్నమునకు కావలసిన సొమ్ము అంతయు సమకూర్చి, వివాహము శ్రీ స్వామి వారి అనుగ్రహంతో చక్కగా జరిపించినారు.

(3) ముఖ్యముగా శ్రీ ఆచార్య భరద్వాజ గారు ఈ మహాత్ముని వద్దకు పంపినందు వల్లనే నా కుమారుడు B.Tech. మరియు మా పెద్ద అమ్మాయి M.Sc. చదివే ఖర్చులు అన్నీ శ్రీ స్వామి వారు, అమ్మయ్య గారు, వారి భక్తులు షుమారు 80 వేల రూపాయలు భరించారు. కనుకనే వారు ఇద్దరు చదవ గలిగారు కాని, నా వల్ల అయ్యే పని కాదు.

శ్రీ స్వామి వారు చెప్పిన మాటలు గమనించ దగినవి. "నీ గురువు సిద్ధి పొందుతూ నిన్ను చూడమని నాకు చెప్పారు. నీ బిడ్డల చదువులకు ఇచ్చేదంతా గత జన్మలో నీ డబ్బే" అన్నారు.

ఆ ప్రాంతపు పల్లె జనాలకి వారు సాక్షాత్తు భగవంతుడే. ఇతరుల నుండి ఏమీ ఆశించకుండా తనకున్న లక్షల ఆస్తిని అందరికి పంచుతూ, హారతి కర్పూరం చేసిన మహనీయులు. ప్రతి వారిని శ్రీ సాయి లీలామృతము, గురు చరిత్ర పారాయణ చేయమని చెపుతున్న శ్రీ స్వామి వారిలో నాకు నా గురుదేవులు శ్రీ భరద్వాజగారే కనిపిస్తారు. ఆచార్యులవారిని శ్రీ దర్గా స్వామి వారు పరబ్రహ్మ స్వరూపులుగా భావిస్తారు. వారు మీకు దొరకటం మీ అదృష్టం అని అంటారు.

**M. సూర్య ప్రకాశ్‌రావు గారికి దర్గాస్వామివారితో కలిగిన అనుభవం:**

ఒక రోజు రాత్రి వారికి విపరీతమయిన మానసిక ఆందోళన, Restlessness, చికాకుగా ఉంది. ఎంతకూ మనసు ప్రశాంతమవక నిద్రపట్టక ఎంతో ఇబ్బంది పడుతున్నారు. తీవ్రమయిన ఆ మానసిక కలవరంతోనే రాత్రి 12.00 గంటలు అయింది. వారి వద్ద సద్గురు దర్గాస్వామివారి ఫోన్ నంబరు ఉంది. వారికి ఫోన్ చేసి మాట్లాడాలని అనిపించి మళ్ళా వద్దనుకొని అలా కొద్దిసేపు ముందువెనకాడి రాత్రి 12.00



గంటల పైన ఫోన్ చేశారు. దర్గాస్వామి ఫోన్ ఎత్తి వారి వివరాలు అడిగి, టైమ్ ఎంత అని అడిగారు. వీరు చెప్పగా ఈ టైమ్‌లో నువ్వు ఫోన్ చేయాలా నేనే నీ వద్దకు వస్తాను అన్నారు. మాట్లాడి ఫోన్ పెట్టేశాక అదేమి చిత్రమో వీరికి అసలు అంతకు ముందు అంత అశాంతిగా ఉన్నది కాస్తా ఏ మాత్రం లేకుండా హాయిగా, ఆనందంగా నిద్రపోయాను. ఆ మరురోజు తన విద్యార్థి ఒకరు అనుకోకుండా **"సాయిసన్నిధి"** గ్రంథం ప్రకాశరావుగారి ఇంటికి తీసుకువెళ్ళి ఇచ్చారు. వారు దాన్ని తెరవగానే స్థానము - మీరున్నచోటు అన్న పేజీ తెరవబడడం వారు దాన్ని చదివి నిన్న స్వామి నేనే నీ దగ్గరకు వస్తాను అంటే ఈ విధంగా నేమో అన్నారు. (ఆ పుస్తక రూపంలో)

**శ్రీ దర్గాస్వామివారు విద్యానగర్‌లోని శ్రీ G. సూర్య ప్రకాశరావుగారికి వ్రాసిన లెటరు:**

చిరంజీవి శ్రీ సూర్య ప్రకాశరావుగారికి శ్రీ సద్గురు దర్గా స్వామీజీ హృదయ పూర్వక ఆశీర్వాదములు. మీ మనస్సులో ఏది సంకల్పించినా ఆ పని కానపుడు మనస్సుకు వికల్పము జరుగును అదే చింతలో ఉంటాము. మనస్సులో అర్థములేని భావనలు వచ్చి తలనొప్పి ఉండును.

మీకు నచ్చిన రూపము వుంచుకొని ఆ రూపములో వున్న వారి పేరు మాటి మాటికి ధ్యానించిన ఏకాగ్రత వచ్చి మైమరచ గలవు గదా! సుషుప్తి వచ్చి సుఖనిద్ర పట్టును. మాత్రలు పూర్తిగా విసర్జించి ధ్యానించి తరించేది. చిరంజీవికి మీకు మా హృదయ పూర్వక ఆశీర్వాదములు.

ఇంతే సంగతులు<br>
శ్రీ సద్గురు దర్గా స్వామీజీ

## సర్వజ్ఞుడు

**రోకలి బండతో భర్తలను కొట్టేందుకే:**

ఆ రోజు గొలగమూడిలోని శ్రీ బ్రహ్మంగారి మఠం ప్రారంభోత్సవంలో శ్రీ శ్రీ శ్రీ దర్గాస్వామి వారు ఉపన్యాసిస్తున్నారు. చాలా మంది భక్తులు క్రిక్కిరిసియున్నారు. అదే రోజు ఆ గ్రామంలోని ఒక గృహప్రవేశముకి, చాలా మంది బంధువులు వచ్చారు. వారంతా బ్రహ్మంగారి మఠం దగ్గరున్నారు. ఉపన్యాసం మధ్యలో ఒకామె హఠాత్తుగాలేచి "స్వామీ ఈ సంసారం, భార్య పిల్లలు ఇదంతా ఎందుకుస్వామీ?" అని అడిగింది. ఎందుకేమిటమ్మా "కలర్ టి.వి., నగలు తెచ్చివ్వలేదని మొగుణ్ణి రోకలి బండతో కొట్టేందుకమ్మా" అని చెప్పి తన ఉపన్యాసం సాగించారు. ఆమె కిం అనకుండా కూర్చున్నది.

గృహప్రవేశం దగ్గర మగవాళ్ళంతా భోంచేసి తాంబూలం సేవిస్తూ పెద్దగా నవ్వుకుంటున్నారు. విషయమేమిటని కనుక్కుంటే ఇందాక శ్రీ స్వామివారు రోకలి బండతో భర్తను కొట్టేందుకే ఈ సంసారమని చెప్పారుగదా! ఆ ప్రశ్న అడిగినామే తన మొగుణ్ణి రోకలి బండతో కలర్ టి.వి. తేలేదని కొట్టింది అని చెప్పారు.

ఎంత చిత్రమో చూడండి! శ్రీ స్వామివారు ఎప్పుడూ వారి గ్రామం పోలేదు. ఆ విషయం వారికి తెలియదని మనం అనుకుంటాము. ఆమె అడిగిన వెంటనే ఏమీ తడుముకోకుండా ఆమె తప్పును కుండ బ్రద్దలు కొట్టినట్లు చెప్పేశారు. అదే సర్వజ్ఞత్వం - సర్వ వ్యాపకత్వం. ఇట్టి మహనీయుడు మన మధ్య ఉన్నా వారి నిజస్థితి తెలుసుకోలేని మన అంధత్వం, అజ్ఞానం ఎంతగొప్పగా ఉన్నాయోగదా!



**దమ్మపేటలో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ:**

మేము మా దమ్మపేట నుండి విగ్రహప్రతిష్ఠకు ముందు 6 సంవత్సరముల క్రిందట పదిమంది సత్సంగబంధువులం శ్రీ దర్గాస్వామి వారిని దర్శించుటకు వెళ్ళినాము. అప్పుడు శ్రీ స్వామితో విగ్రహము కొరకు ప్రయత్నిస్తున్నామని, ప్రసాదరావుగారు ఇస్తానన్నారని చెప్పినాము. అప్పుడు శ్రీ స్వామి ఆయన ఎలక్షన్‌లో గెలవరు కానీ, విగ్రహం ఇస్తారని అన్నారు. ప్రతిష్ఠకు "నేను వస్తానని" అన్నారు. మేము ప్రతిష్ఠకు ఆహ్వాన పత్రిక పంపితే సరిగ్గా ఆ రోజునే శ్రీ స్వామి నుండి "ఏ రూపంగానైనా వచ్చేదే" అని వ్రాసిన జాబు చేరింది. ప్రసాదరావుగారు నిమిత్తమాత్రమేనని వారికా బుద్ధిపుట్టించి ఇప్పించిన విశ్వరూపుడైన సకల సాధుస్వరూపుడైన శ్రీ సాయి తాము ఒక్కటేనని గ్రహించమన్నట్లు భావించాము. జ్యోతిగారు దర్శించగా శ్రీ స్వామి మీ మందిరంలో బాబా విగ్రహ రూపంలో ఉండి మీ పూజలు, నివేదనలు స్వీకరిస్తున్నానని చెప్పారు."

**దమ్మపేట మోహనరావుగారు శ్రీ దర్గాస్వామివారితో వారి గురించి చెప్పిన విషయములు:**

(1) ఒక రోజు శ్రీ స్వామివారి తండ్రి గారు దర్గాల వద్దకు వెళ్ళి మా అబ్బాయికి సంతానం ఇవ్వండి అని అడిగినారు. అప్పుడు దర్గాల లోపల వున్న మహాత్ముడు చెంప మీద కొట్టినారు. 15 నిమిషాల వరకు స్పృహలేదు. తరువాత ఇంటికి వచ్చి శ్రీ స్వామి వారిని దర్గాలకు సేవ చేయవద్దు, నన్ను ఆయన కొట్టినారు, నీవు వెళ్ళవద్దు అని గట్టిగా చెప్పినారు. ఎందుకు నిన్ను కొట్టారు అని శ్రీ స్వామి వారు అడిగినారు. నీకు సంతానం ఇవ్వమని ఆయనను అడిగాను అందుకు కొట్టినారని చెప్పారు. నేను సంసారం చెయడం లేదు కదా! నీవు సంతానం ఎలా

అడిగావు అని స్వామి అన్నారు. ఈ రోజు నుండీ నీకు, నాకు ఏమీ సంభంధము లేదు. నేను వెళ్ళిపోతున్నాను అని తండ్రి గారితో చెప్పి భార్యను తీసుకొని దర్గాల వద్దకు వచ్చి తపస్సు ప్రారంభించారు. 3 సంవత్సరముల తరువాత తండ్రిగారు స్వామి వారి వద్దకు వచ్చి సృష్టి రహస్యం ఏమిటో చెప్పు అని అడిగారు. అది చెప్పకూడదు చెబితే 21 రోజులలో నీవైనా చనిపోవచ్చు లేక నేనైనా పోవచ్చు అని స్వామివారు అన్నారు. అప్పుడు తండ్రిగారు నాకు అన్ని భాద్యతలు అయిపోయినాయి నాకు పరవాలేదు చెప్పు అన్నారు. అప్పుడు స్వామి సృష్టి రహస్యం చెప్పినారు. 21 వ రోజు తండ్రిగారు కాలం చేసారు.

(2) **6-10-2003:** ఉదయం కాకడ హారతి అయిన తర్వాత శంకరయ్య గారిని స్వీట్సు ముక్కలు చేసి ఎందుకు పంచినావు? నేను 130 మంది వస్తారు 130 తీసుకు వెళ్ళు అంటే 100 ముక్కలు తీసుకు వెళ్ళి ముక్కలు చేసి పంచి పెడతావా అని తిట్టినారు. అప్పుడు ఎంతమంది వచ్చేది, వారికి సర్వం తెలుసు అని వారి సర్వజ్ఞత్వం అలా వెల్లడి చేసినారు.

(3) స్వామి దగ్గరకు వెళ్ళక ముందు ఒక రోజు తీవ్రంగా జ్వరం వచ్చింది. స్వామి ఇంత జ్వరం పెట్టితే. నేను ఎలా తట్టుకోగలను అని స్వామి వారిని ప్రార్థించాను. 10 నిమిషాల్లో జ్వరం తగ్గంది అంటే దమ్మపేటలో వుండి ప్రార్థించిన వెంటనే నీలకంఠరావు పేటలో వున్న స్వామికి తెలిసింది అంటే వారు అంతటా వ్యాపించియున్నారు. వారు సర్వసమర్థులు కానిదే అలా చెప్పలేరు. నా జ్వరం తగ్గించలేరు. ఆ తర్వాత నేను శ్రీ స్వామి వారి దగ్గరకు నీలకంఠరావుపేట వెళ్ళాను. "ఒరే మోహన్ నీవు ఒక్క రోజు బాధ కూడా అనుభవించక నన్ను తిట్టినావురా!" అన్నారు శ్రీ స్వామివారు.



(4) నన్ను విజయదశమికి రెండు రోజులు ముందుగా రమ్మని చెప్పినారు. అరటి తోట తడపాలి నాకు ఇప్పుడు వీలు పడదు అని ఫోటో రూపంలో వున్న స్వామితో చెప్పినాను. గురువారం రోజు చెప్పినాను. ఆ రాత్రి 7 దుక్కుల వర్షం పడింది. ఇక తోట పని ఏమీ లేదు అని శుక్రవారం బయలు దేరి స్వామి వద్దకు వెళ్ళినాను. నన్ను చూచి, ఒరే మోహన నీవు వర్షం పడక పోతే రానన్నావట, వర్షం పడిందటగా, వర్షం సరిపోతుందా? ఇంకా కావాలా? అని అడిగినారు. వారి సర్వజ్ఞత్వం, సర్వ సమర్థత్వం అలా వెల్లడి చేశారు.

(5) ఒక రోజు స్వప్నంలో నన్ను చూచి ఒరే మోహనా వచ్చినావా అన్నారు. నన్ను దర్గాల దగ్గరకు ఎత్తుకొని తీసుకు వెళ్ళు దీపం పెట్టాలి అన్నారు. అంటే నాకు ఆరోగ్యం బాగుండక పోయినా నిత్య కార్యక్రమము చేస్తున్నాను. నీకు మంచిగా వున్నా సేవ చేయడం లేదు అని హెచ్చరించి నట్లుగా వున్నది ఈ స్వప్నం తర్వాత సాధన మంచిగా జరుగుతోంది. చిన్న చిన్న అడ్డంకులను సాకుగా తీసుకొని నిత్యకృత్యాన్ని తారు మారు చేసుకునే మనకు ఈ బోధ చాలా చక్కగా ఉపయోగపడుతుంది.

(6) ఒక రోజు "మోహనా నీకు తెలుసుగా అమ్మయ్యాని అడిగి బియ్యం తీసుకొని వండుకుని తిన్న తర్వాత పడుకోండి. రేపు ఉదయం చెపుతాను" అని అన్నారు. వెనకాల వచ్చిన 9 మందికి మోహన గారే వండాలి అని అన్నారు. మరియు ఎవరూ ఎటువంటి సాయం చేయలేదు. ఇంత మందికి ఎన్ని బియ్యం వండాలో తెలియని మోహన గారు ఒక కేజి బియ్యం తెచ్చి స్వామి మీద నమ్మకంతో శ్రీ గురు చరిత్రలోని భాస్కర శర్మ చేసిన భిక్ష సన్నివేశాన్ని గుర్తు చేసుకొని వండారు. ఆ వండిన అన్నాన్ని ఆ 11 మంది తినటమే కాక మరొక నల్గురుకి ఇచ్చారు. మరియు ఇంకా మిగిలిన ఇద్దరు ముగ్గురుకి సరిపోయే అన్నాన్ని అక్కడ వున్న కుక్కలకు పెట్టారు. అంటే 1kg. బియ్యం 18 మందికి సంతృప్తిగా సరిపోయింది! ఇది శ్రీగురుడు సన్నిధిలో భాస్కర శర్మ చేసిన భిక్షను పోలివున్నది.

## దమ్మపేట సత్సంగ సభ్యురాలు శ్రీమతి చంద్రావతి గారి అనుభవం:

వీరికి పది సంవత్సరముల క్రితం నుండి ఉదయము ఏమీ తీసుకోకుండా గురుచరిత్ర, ఇతర చరిత్రలు నిత్యం శ్రద్ధగా పారాయణ పూర్తి చేసుకొనే భోజనం తిని మరల రాత్రి భోజనం మాత్రమే తినటం అలవాటు. వీరి భర్తగారైన శ్రీ రామకృష్ణగారు ఇలా చేస్తుంటే నీరసపడి బలహీన మవుతావు అని అభిప్రాయ పడేవారు. ఇటీవల వారు శ్రీ దర్గా స్వామి వారిని దర్శించినప్పుడు రామకృష్ణగారు ఈ విషయం గూర్చి స్వామి వారితో చెప్పుకున్నారు. అప్పుడు శ్రీ స్వామివారు "ఏమైంది? ఆ అమ్మాయికి ఈ పది సంవత్సరాల్లో ఒక్క మందుబిళ్ళ అయినా కొని తెచ్చావా? ఇచ్చావా?" అన్నారు. అనారోగ్యం లేనందు వల్ల ఏ ఒక్క మందూ వాడవలసిన అవసరం లేక పోయింది. ఇదే విషయం శ్రీ స్వామి వారు ప్రస్తావించడంతో శ్రీ స్వామివారి సర్వజ్ఞత్వంకు ఎంతో ఆశ్చర్యపోయారు. వారి మనస్సు కుదుట పడింది.

## ముత్తా సత్యనారాయణ - కాఫీ హోటల్ ఓనర్ - దమ్మపేట:

వాళ్ళబ్బాయి, పుల్లారావుకు మోకాలు మీద నీరు, చీము వచ్చింది. 2002 లో విజయవాడలో 30,000/- ఖర్చుతో ఆపరేషన్ చేయించారు కానీ తగ్గలేదు. ప్రతి నెలా విజయవాడ ఆసుపత్రిలో రెగ్యులర్‌గా చెకప్ చేయిస్తున్నారు ప్రతినెలా 1000/- ఖర్చు, వ్యాధి తగ్గలేదు. దర్గాస్వామి భక్తుడు మోహన్‌గారు వారికి స్వామి ఫోటో పెట్టుకుని ప్రదక్షణలు చెయ్యండి. తగ్గాక స్వామి దర్శనానికి వెళ్ళమని చెప్పారు. ప్రదక్షణలు 4, 5 రోజులు చేసేసరికి బాధ, వాపు చాలా వరకు తగ్గిపోయాయి. రెండు మాసాలు ప్రదక్షణలు చేసిన తర్వాత స్వామి దర్శనానికి వెళ్ళారు. ఏమిటి నీ బాధ? అని శ్రీ స్వామివారు అడిగారు. మీ ఫోటో పెట్టుకుని ప్రదక్షణలు చెయ్యడం మొదలు పెట్టిన తర్వాత బాధ తగ్గింది. ఇప్పుడు కొంచెం వాపు



ఉంది. అదికూడా తగ్గిస్తారని మీ దగ్గరకు వచ్చామని సత్యనారాయణగారు చెప్పారు. స్వామి అతని అబ్బాయి కాలు చూచి ఇంతకు ముందు ఆపరేషన్ చేయించారు, అది సక్సస్ కాలేదు. మళ్ళీ ఆపరేషన్ చేయాలి అన్నారు. ఇంతకు ముందే 30,000/- ఖర్చయ్యింది. మరలా అంత ఖర్చు పెట్టలేము అని ముగ్గురూ (తల్లి, తండ్రి, పిల్లవాడు) కాళ్ళ మీద పడి ఏడ్చారు. ఈ రోజు రాత్రి దర్గాల దగ్గర నిద్ర చేయండి, రేపు చూస్తాము అని స్వామి అన్నారు. తర్వాతరోజు సత్యనారాయణ గారితో మీ అబ్బాయికి వ్యాధి తీసేసాను. ఆపరేషన్ అవసరంలేదు అని అన్నారు. హైదరాబాదులో NIMS హాస్పిటల్‌కి వెళ్ళి డాక్టరు ఇచ్చే ఆయింట్‌మెంట్ రాయమని చెప్పారు. 20 రోజుల తర్వాత NIMS లో చకప్ చేయిస్తే ఆపరేషన్ చేయాలి. 20,000/- తీసుకురమ్మని చెప్పి, 10 రోజులు ఉండేటట్లుగా రమ్మన్నారు. ఈ విషయం మోహన్‌గారికి చెప్పి శ్రీ స్వామివారిని ఈ విషయం గూర్చి అడగమని చెప్పారు. శ్రీ స్వామివారు ఆ విషయం చెబితే అక్కడ ఏమి ఉందని ఆపరేషన్ చేస్తారు? ఆపరేషన్ అవసరం లేదు, వాళ్ళే తర్వాత దర్శనానికి వస్తారు అని చెప్పారు. మోహన్ గారు స్వామి చెప్పిన మాటలు చెప్పి, మీరు భయపడవలసిన అవసరం లేదు. డబ్బులు తీసుకొని వెళ్ళండి. ఆపైన స్వామి చూచుకుంటారు అన్నారు. హైదరాబాద్ ఆస్పత్రిలో అడ్మిట్ చేసిన తర్వాత ఆపరేషన్ థియేటర్‌లో స్వామి ఫోటో పెట్టి సర్వబాధ్యతలు నీవేనని చెప్పి ఏడ్చారు. డాక్టర్లు పరీక్ష చేసి జబ్బు లేదు అందువలన ఒక రోజుండి అవసరమైతే రేపు చూసి ఆపరేషన్ చేద్దాము అన్నారు. ఆ తర్వాత రోజు కూడా వ్యాధి లక్షణాలు కనపడలేదు. తర్వాత కేరళ డాక్టర్‌ను కూడా పిలిపించి చూపించారు. ఆయన పరీక్ష చేసి ఏమి లేదు ఆపరేషన్ అక్కరలేదన్నారు. ఆయింట్‌మెంట్ మాత్రలు ఇచ్చి పంపారు. ఇంటికి తిరిగివచ్చిన తర్వాత విజయ దశమికి కృతజ్ఞతలు తెలుపుకోవడనికి దర్గాస్వామి దర్శనానికి వెళ్ళారు. స్వామి వీరిని చూచి "ఒరేయ్! సత్తీ! ఏముందని ఆపరేషన్ చేస్తాడ్రా డాక్టరు" అని ఆ

సంగతంతా భక్తులకు చెప్పి అంతా దైవలీల అని, పరమాత్మ లీల అని చెప్పారు.

మోహన్‌గారిని నీవు నాకు ఏమి తీసుకు వచ్చావు అని అడుగగా మీకు ఏమీ తీసుకురాలేదు. బాబాకు వస్త్రాలు తీసుకు వచ్చాను అని మోహన చెప్పారు. నీవు నాకు లడ్డు తీసుకురాలేదా? అని అడిగిన తర్వాత మోహన్‌గారికి తను లడ్డు తీసుకు వచ్చిన సంగతి గుర్తుకు వచ్చింది. తెచ్చిన భక్తుడు మరచిపోయినా శ్రీ స్వామి వారు తన వస్తువు అడిగి తీసుకున్నారు.

ఎవరో భక్తులు ఏదో సమస్య విషయం అడగాలని శ్రీ దర్గా స్వామి వారి దగ్గరకు నీలకంఠరావు పేట వచ్చారు. ఆ వచ్చిన వ్యక్తి ఆరోగ్యంగా ఉన్నాడు. కొంత కాలానికి నీకు చాలా ప్రమాదమైన జబ్బు చేస్తుంది. దేవుడు రక్షిస్తాడు అని చెప్పారు. ఆ వచ్చిన వారికి ఇదేమీ అర్థంకాలేదు. వారు ఇంటికి వెళ్ళిన కొద్ది రోజులకు ఆయనకు మెంటల్ వచ్చినట్లు ప్రవర్తించసాగాడు. ఎంతో తెలివి గలవాడు. చలాకీ అయిన వాడు. ఏమీ మాట్లాడకుండా ఇంట్లో ఒక మూల కూర్చో సాగాడు. వాళ్ళు చేతబడులు, స్పెషలిష్టు డాక్టర్లు, యంత్రాలు మంత్రాలు అన్నీ చేసి విఫలమైనారు. ఆయన తల్లిగారు మాత్రం ఏమారకుండా శ్రీ స్వామి వారిని స్మరించి తన కుమారుని దుస్థితిని మానసికంగా శ్రీ స్వామివారికి విన్నవించుకుంటు ఉండేది. ఒక రోజు ఆయనకు నెల్లూరు ఆస్పత్రిలో ఆపరేషన్ చేశారు. ఆయన తల్లిగారికి ఆయన మంచం చుట్టూ ఒక చంద్రబింబంలాంటి వెలుగులో శ్రీ దర్గాస్వామి వారు అభయహస్తం చూపుతున్నారు. ఆ వెలుగులో శ్రీ స్వామి వారు ఆయన మంచం చుట్టు తిరుగుతున్నట్లు దర్శనమైంది. అనతి కాలంలో అతనికి ఆరోగ్యం చేకూరింది. ఆ తల్లి నీలకంఠరావు పేటలో శ్రీ స్వామి వారిని దర్శించి ఆస్పత్రిలో నాకు ఇలా నా



బిడ్డ మంచం చుట్టూ తమరొక వెలుగులో అభయహస్తం చూపుతూ తిరుగుతున్నారు. గనుక నా బిడ్డకు ఆరోగ్యం తమరి కృపవల్లనే చక్క బడింది అని ఆమె బల్లగుద్ది చెపుతుంది. నీవలా చెప్పకూడదమ్మా అని శ్రీ స్వామి వారు ఎంతో అనునయంగా ఆమెకు చెపుతున్నారు. వారే ఆమెకు దర్శనమిచ్చి వారికి నయంచేసినా అందరి ఎదుట అలా తన మహిమను ప్రచారం చేయడం ఇష్టంలేని శ్రీ స్వామి అలా చెప్పకూడదమ్మా అంటున్నారు.

నిజమైన సత్పురుషుల లక్షణమది. నేను అల్లాకు మాత్రమే బానిసను. నా నుండి ప్రకటమయ్యే లీలలన్నీ గురుకృపకు నిదర్శనమే అని శ్రీ షిర్డి సాయి చెప్పిన దానికిది సరిపోయింది.

## సర్వసమర్ధ సద్గురు శ్రీ శ్రీ శ్రీ దర్గాస్వామి వారి బోధలు:

(1) ప్రదక్షిణ చేసేటప్పుడు త్వరత్వరగా నడువరాదు. భూదేవికి దెబ్బతగలని విధంగా మెల్లగా నెమ్మదిగా హృదయమంతటితో, మనస్సులో వేరే ఆలోచన రానీయకుండా అలా ప్రదక్షిణ చేస్తూ వారిని స్మరించే అవకాశమిచ్చిన పరమాత్మను కృతజ్ఞతతో స్మరించుకుంటూ నడవాలి. భావనే ప్రధానం కానీ ఎన్ని చుట్లు తిరిగాము అనేది కాదు. ఇది శ్రీ వెంకయ్య స్వామి క్లుప్తంగా **ఒక్కచుట్టే గదయ్యా** అన్న మాట లాగానే ఉంది.

(2) టెంకాయ కొట్టేటప్పుడు టెంకాయ నీరు క్రింద పడకుండా చెంబులోకి పట్టవద్దు. భూదేవిని త్రాగనివ్వండి. టెంకాయ కొబ్బరంతా మనమే తింటిమి, నీళ్ళనీ మనమే త్రాగుతుంటిమి. ఆ కాయను కాయించిన భూమాతకేమిస్తున్నాము? కాయలిచ్చినందుకు కృతజ్ఞతతో అన్ని టెంకాయ నీళ్ళయినా ఇవ్వవద్దా?

(3) A.C. కార్లలో ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వారు దగ్గరకు వచ్చి ఏమీ పలకక ముందే-ఒరేయ్ దొంగ వెధవల్లారా నా ఇత్తడిచెంబు దొబ్బుక పోయింది మీరే. బుద్ధిలేదూ పొండి ఇక్కడ నుంచి అని ఉచ్చనీచాలు తిడుతూ వారిని బయటికి నడవమన్నారు. వారు హడలి పొయ్యారు. కొన్ని క్షణాల తర్వాత, ఆ ఇక లోపలకు రండి అని ఆదరంగా పలికారు. ఆ తిట్ల ద్వారా వారిలో ఏ ఖర్మలను క్షాళన చేస్తున్నారో మనకేమి తెలుస్తుంది.

(4) G. గోపాల్ వెళ్ళగానే చాలా ఖఠినంగా మాట్లాడారు. లంజా కొడకా అనికూడా అన్నారు. తర్వాత ఎవ్వరినీ లోనికి రానీయకుండా వీరిని మాత్రం హారతికి రానిచ్చారు. గేటుకు అవతలనే చాలా మందిని నిలిపేశారు. శ్రీ స్వామివారు సాయి మందిరంలో దీపారాధన చేస్తున్నారు. వారికి గేటు దగ్గర ఉండే వాళ్ళు కనపడే అవకాశమేలేదు. వారి మాటలు వినపడే అవకాశమేలేదు. ఒక తల్లి హారతికి పోవాలని గేటు దగ్గరకు వచ్చింది. గేటు దగ్గర కావలి ఉండే ఆయన నోటి కడ్డం వేలుపెట్టి శబ్దంచేయవద్దని సైగ చేస్తూ ఆమెను ప్రక్కకు వెళ్ళమని చేత్తో సైగచేశాడు. ఎక్కడో లోపల ఉన్న శ్రీ స్వామి వారు అశుద్ధ బ్రహ్మలారా! ఎక్కడ దాపురించారురా మీరు? ఆ తల్లిని లోపలకు రానీయండిరా అని గట్టిగా అరచారు. వారెక్కడున్నా ఈ విశ్వములో ఏ మూల ఏం జరుగుతుందో తెలుస్తూనే ఉంటుంది. అనుక్షణం ఎవరేమి మాట్లాడినా వారికి తెలిసిపోతుంది.

(5) గోపాల్‌ను చాలా కఠినంగా మట్లాడారు - ఉద్యోగం వస్తుందని చెప్పానుగదా. మరలా వచ్చావెందుకురా లంజాకొడకా అంటూ తిట్టారు. బిడ్డల తలనీలాలు సమర్పించిన ఒక ముస్లిం స్త్రీ అక్కడకొస్తే ఆమెతో నవ్వుతూ చాలా ఆనందంగా మాట్లాడుతున్నారు. గోపాల్ ఇది చూచి ఇక్కడ ముస్లిం జనాభా అధికము గనుక వారితో సహృద్ భావంతో



మెలగకుంటే వారి నుండి ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని గాబోలు శ్రీ స్వామి వారు ఆమెతో అంత ప్రేమగా మాట్లాడుతున్నారు. హిందువునైన నన్ను ఘోరంగా తిట్టుతున్నారు అని మనసులో అనుకోగానే శ్రీ స్వామి వారు గోపాల్ వైపు తిరిగి "నాకెవరిని చూచినా భయం లేదోయ్" అన్నారు. మన మనస్సులో కలిగే ప్రతిభావమూ ఆలోచనా వారికి తెలుస్తూనే ఉంటుంది.

(6) కావలి భక్తులు టెంకాయ బోండాలు తీసుకొని వచ్చారు. రాగానే వాళ్ళను తెగతిట్టి వీడు రోగం పోవాలని వీడు డబ్బు కావాలని వీడు మూట కావాలని వచ్చారు. మాకింకేమీ పని లేదా? పోండిరా పోండి అని గేటు వరకు తరిమి వేశారు. వాళ్ళక్కడనే నిలుచొని ఉన్నారు. కొంత సేపయ్యాక దగ్గరకు పిలచి టెంకాయ బోండాలు అక్కడ పెట్టమని నిజమైన ఆర్తితో, తీవ్రమైన కోరికతో దృఢమైన విశ్వాసంతో ఈ కొబ్బరికాయ తీసుకోండి వారికోరిక తప్పక నెరవేరుతుందని సవాలుచేసినట్లు ఉచ్చ కంఠంతో పలికారు. చేయిపట్టిన వాళ్ళకంతా ఇచ్చేశారు. వారిలో ఒకాయన కొన్ని బాధలలో వచ్చారు. అంతకు ముందురోజు అక్కడున్న సమాధులకు నమస్కరిస్తుంటే అభయహస్తం ఆ సమాధుల మధ్య స్పష్టంగా కనిపించింది. అదేదో తన భ్రమ అని అనుకొని దాన్ని తన మిత్రుడు గోపాల్‌కు చెపితే అలాంటివి పట్టించుకోవద్దన్నాడు. ఇప్పుడు ఈ టెంకాయబోండా కొరకు తాను దోసిలి చాపాడు. వెంటనే శ్రీ స్వామి నిన్న నీకు అభయహస్తం ఇచ్చానుగదా. ఇంకా మళ్ళీ ఇదెందుకూ అంటూ అతనికి టెంకాయ ఇవ్వలేదు. అంటే నిన్న ఆయనకు అభయహస్తం కనిపించిన విషయం ఎవరూ చెప్పకుండానే వారికి తెలిసింది. ఆ అభయహస్తం ఇచ్చింది నేనేనని చెపుతున్నారు. ఆ సమాధుల్లో మహనీయులకు, నాకు బేధంలేదని కూడా చెపుతున్నారు.

(7) సాంబ్రాణి కడ్డీలు భక్తులు తెస్తే - వాటిని వెలిగించి అక్కడ కడ్డీలు వెలిగించే పాత్రలో ఉంచమన్నారు. ఒక వ్యక్తి ఆ వెలిగించిన కడ్డీలు సమాధుల దగ్గరుండే చిన్న దిన్నె పై పెట్టి నమస్కరించుకున్నాడు. కొంత సేపు అయ్యాక శ్రీ స్వామి వారు ఆ కడ్డీలు చూచి ఉగ్రుడైపోయి "ఇక్కడ కడ్డీలు వెలిగించి పెట్టిన లంజాకొడుకు ఎవరు" అని అరిచారు. అక్కడున్న ఆరు మందిలో ఎవ్వరూ సమాధానం చెప్పలేదు. అంత మందిలో శ్రీ స్వామి వారు ఒకరి వైపు చూపిస్తూ ఓరేయ్ బుద్ధిలేనివాడ అక్కడ వెలిగే సాంబ్రాణి కడ్డీలు పెట్టింది నీవేనా అని గట్టిగా అరిచారు. వెంటనే వాడు నేనుకాదు స్వామి అన్నాడు. ఈ సమాధులలో ఉన్న శ్రీ స్వాములు సత్యమైనవారు. నీవు అబద్ధం చెపుతున్నావు సాయంకాలానికి నీ అంతు తేల్చుకుంటారు అనే సరికి బిక్క చిక్కిపోయాడు. రెండు గంటల సేపు ఆలోచించి నేనే స్వామి కడ్డీలు వెలిగించాను క్షమించండి అని కాళ్ళ మీద పడ్డాడు.

## దర్గాస్వామి సర్వజ్ఞత్వం, సర్వశక్తిమత్వం, సర్వవ్యాపకత్వం, భక్త వత్సలతలను నిరూపించిన లీల: (కొంచాట శ్రీనివాసరావుగారు)

ఒక రోజు పదకొండు సంవత్సరాల క్రితం నిద్రలేచేసరికి కాలు పట్టేసి (మోకాలు దగ్గర) ముడవలేక పోయారు. ముడవయత్నిస్తే బాగా పోటువచ్చింది. మోకాలు వద్ద, పాదం వద్ద చాలా లావు, వాపు వచ్చింది. వెంటనే రాజమండ్రి అరవింద ఆసుపత్రిలో చూపించారు. వారు మందులు, ఇంజక్షన్ చేస్తే కాలు ముడవగలిగారు, కానీ ఆ వాపు, నొప్పి పూర్తిగా తగ్గలేదు. (నొక్కితే చొట్టలుపడేవి, నీరు వున్నట్లు ఉబ్బేది) అప్పటి నుండి **నాలుగు సంవత్సరాలు** పాటు ఎన్ని మందులు వాడినా ఆ వాపులు, నొప్పి పూర్తిగా ఎన్నడూ తగ్గలేదు. మందులు తీసుకుంటే 10% మాత్రమే తగ్గేది - నొప్పులూ, వాపులూ పూర్తిగా ఎప్పుడూ తగ్గలేదు. ఎప్పుడైనా మందులు వేసుకోడం మానేస్తే వెంటనే విపరీతంగా ఎక్కువ అయ్యేవి.



రోజూ పది, పదకొండు మాత్రలు వేసుకొంటుండేవారు. రాజమండ్రి ఇక్కడకు దూరమవడంతో, ఏలూరులో స్నేహ ఆసుపత్రిలో **మూడు సంవత్సరాలు** మందులు వాడారు. వారికి యక్స్‌రే తీసి కీళ్ళు అరిగాయని మొదటే చెప్పారు. తరువాత ఏలూరులో ఫణీంద్ర కుమార్ ఆసుపత్రిలో, తరువాత కొన్ని సంవత్సరాలు మరికొన్ని చోట్ల, దమ్మపేట రామకృష్ణగారి దగ్గర చూపించుకొంటూ గత పదకొండు సంవత్సరాలుగా మందులు వాడుతూనే వున్నారు. కానీ పూర్తిగా అసలు నొప్పి, వాపులు తగ్గిన రోజేలేదు. మందులకు 10% మాత్రమే తగ్గుతూ, మానేస్తే హెచ్చుతూ వుండేది. ఇలావుండగా ఏప్రిల్ 26, 2000 రాత్రి తొమ్మిది గంటలకు వాంతి అయి రక్తం పడింది. వెంటనే డాక్టరుగారిని పిలిస్తే చూచి (నీరసంగా ఉంటే), సెలైను ఎక్కించి ఈ రోజు అన్నం పెట్టవద్దు. రెండు ఇడ్లీలు పెట్టండి అన్నారు. మందులిచ్చి వెళ్ళారు. తరువాత ఆయన ఒక ఇడ్లీ తిని ఇక చాలు (సహించక) అని పడుకోడానికి మంచం దగ్గరకు వెళ్ళారు. వెళ్ళి పడుక్కున్న వెంటనే దుర్గా! దుర్గా! (వాళ్ళ అమ్మాయి పేరు) అని పిలుస్తూ వాంతి చేసుకోవడంతో భళ్ళున చాలా రక్తం పడి స్పృహ తప్పిపోయింది. దుర్గ బాబా! బాబా! దత్తాత్రేయా అని అరుస్తూ (ఆ రోజు గురువారం గుడి నుండి తెచ్చిన) విభూతి నొసటన పెట్టి వళ్ళంతా పూశాక స్పృహవచ్చి ఏంటి, ఏంజరిగింది అని అడిగి మళ్ళీ స్పృహకోల్పోయారు. డాక్టరుగారిని తీసుకురాగా వారి ఎదుటనే మళ్ళీ వాంతులు, చాలా రక్తం పడింది. వెంటనే ఆ రాత్రి సత్తుపల్లి తీసుకువెళ్ళారు. వెంటనే రక్తం ఎక్కించారు. వారికి మందులు అధికంగా వాడిన కారణంగా ulcer వచ్చిందని చెప్పి మందులు ఇచ్చి మూడురోజుల తరువాత అన్నం పెట్టమన్నారు. ఆ విధంగా మూడవ రోజున అన్నం తినడంతో మళ్ళీ అలాగే వాంతి అయి కుప్పకూలిపోయారు. విజయవాడ తీసుకువెళ్ళారు. డాక్టరు వారం రోజులు ఉంచి మందులు, ఇంజక్షన్లు ఇస్తూ ఆ వారంలో 80 సెలైను బాటిల్స్ ఎక్కించారు. కేవలం వ్యక్తులు పట్టుకునే లేవదీసి నడిపిస్తే తప్ప లేచే

స్థితిలేదు. వారం తరువాత ఇంటికి తీసుకువెళ్ళమన్నారు. స్కానింగ్ తీయిస్తే ఊపిరితిత్తులలో గాలిగోడల దగ్గర రెండు రాళ్ళున్నాయని తెలిసింది. డాక్టర్ 12 వేలు అవుతుంది. ఆపరేషన్ చేసి తీయాలి అన్నారు. అప్పటికే ఇల్లు అమ్మి వచ్చిన 44 వేలతో మొన్నటి వరకూ వైద్యం చేయించడానికి సరిపోయింది. ఇక శక్తిలేక చేయించలేదు. డాక్టరు టమేటో, క్యారెట్, పాలు, టీ మొదలగునవి తీసుకోవద్దన్నారు. ఇంతకు ముందు మొక్కుకున్న ప్రకారం 2001, డిసెంబర్ 20 న సుబ్రహ్మణ్య శష్ఠిరోజున ఎర్రగుంట పల్లిలో నాగేంద్రస్వామి పుట్టలో పాలు పోయడానికి వెళదామని చెబితే ఆ రోజు తలంటుకొని ఆటోలో అందరూ బయలుదేరి వెళ్ళి పోసివచ్చారు. వచ్చిన మధ్యాహ్నం నుండి జ్వరం, కాళ్ళవాపులు, నొప్పులు తీవ్రంగా వచ్చాయి.

ఇలా జ్వరం, నోరు ఎండిపోవడం అన్నీ వుండడంతో దుర్గగారు భయపడి తట్టుకోలేక వెంటనే దర్గాస్వామికి ఫోన్ చేసింది. వెంటనే ఫోన్ లిఫ్ట్ చేశారు. "నేను దమ్మపేట నుండి చేస్తున్నాను. దుర్గను స్వామీ మా నాన్నగారికి ఇలా బాగా జ్వరం, నొప్పులు -- వచ్చాయి. మీ వద్దకు రావాలని వుంది, అంది" స్వామి "రండమ్మా, బియ్యం ఇస్తా. వండుకొని తిందురుగానీ అన్నారు. హోమియో మందులు వాడండి, డాక్టరు దగ్గరకు తీసుకు వెళ్ళండి అన్నారు. పరవాలేదు తగ్గుతుంది. కంగారు పడకండి" అన్నారు. ఇంతలో ఫోన్ వారి అబ్బాయి తీసుకున్నారు "స్వామి నేను మెకానిక్ని ఇక్కడ పనులేంలేవు. వేరేచోటికెళ్ళి పని చేద్దామనుకొంటున్నాను. ఏం చేయమంటారు? అన్నారు." స్వామి "కొన్నాళ్ళ సహనం వహించు. అవే చక్కబడతాయి. ఎక్కడకు వెళ్ళవద్దు అని చెప్పారు." వాళ్ళ నాన్నగారు ఫోన్ అందుకొని (వాళ్ళ అబ్బాయికి ముందే వారు మాట్లాడారు) "స్వామి నాకు ఇలా ---- అనారోగ్యంగా వుంది. అనగా, స్వామి "సాయినాధుడు మీ అండ వున్నారు, పరవాలేదు, తగ్గిపోతుంది. ఏం కంగారు పడకండి"



ముగ్గురూ మాట్లాడాక ఫోన్ పెట్టేశారు. ఒక్క వాళ్ళమ్మగారు మాత్రమే మాట్లాడలేదు. ఆమె "అయ్యో! స్వామితో నేనొక్కదానినే మాట్లాడలేక పోయాను" అని చాలా బాధ పడ్డారు. వారి భర్తకు అనారోగ్య కారణంగా తెల్లవార్లు నిద్రపోలేదు. తెల్లవారేసరికి జ్వరం చాలా ఎక్కువగా పెరిగి మనిషి నుంచునే స్థితిలో కూడా లేకపోవడంతో డాక్టరును తీసుకువచ్చారు. డాక్టరు మందుబిళ్ళలు వేయించి మజ్జిగ త్రాగించ మన్నారు. త్రాగగానే వాంతయింది. అప్పుడు వెంటనే ఇదివరకు ఒకసారి వాంతి అవడం serious అవడం గుర్తొచ్చి అలా అవుతుందేమోనని చాలా కంగారు పడ్డారు. డాక్టరు వాంతి అవకుండా టాబ్లెట్, ఇంజక్షన్ చేసి వెళ్ళారు. ఉదయం 10.00 గంటలకు దర్గా స్వామి వారికి, దుర్గ ఫోన్ చేయగానే స్వామీ లిఫ్ట్ చేశారు. అప్పుడు "స్వామీ! మళ్ళీ ఫోన్ చేస్తున్నానని కోప్పడకండి" అని అనగానే (ఇంకేం చెప్పకుండానే) "ఎవరూ? దమ్మపేట, దుర్గా అని స్వామి అడిగారు" అప్పుడు స్వామీ ఇలా మళ్ళీ వాంతయింది, జ్వరం తీవ్రంగా వుంది, భయంవేస్తోంది అనగా "డాక్టరు దగ్గరకు తీసుకు వెళ్ళమన్నాను కదా! హోమియొపతి మందు ఇప్పించమన్నాను కదా? ఏమ్మా! వెళ్ళలేదా? అని అడిగారు" అప్పుడు స్వామీ! ఇలా చాలా ఎక్కువగా వుండడంతో తీసుకు వెళ్ళలేదు. భయమేస్తోంది అని ఫోన్ వాళ్ళమ్మగారికి ఇచ్చింది. (ఇంతకు ముందు రాత్రంతా ఎంతో మదన పడి వుండడంతో) ఫోన్ తీసుకోగానే విపరీతమయిన దుఖంతో ఏడుస్తూ "స్వామీ! నాకేం వద్దు, సిరి సంపదలు, ధనధాన్యాలు వద్దూ! ఆయన ఆరోగ్యం బాగుంటే చాలు మీ ఆశీస్సులు కావాలి. ఆయనకు మోకాళ్ళు, కీళ్ళ నొప్పులు చాలా సంవత్సరాల నుండీ తగ్గలేదు. ఊపిరితిత్తులలో రాళ్ళువున్నాయట, కీళ్ళు అరిగాయి అన్నారు, స్వామీ". యక్స్రే తీయించి డాక్టరు కూడా అదే చెప్పారు. ఒక్క హోమియోపతీ మాత్ర, ఒక్కటి వేయి, చాలు తగ్గిపోతుంది అన్నారు. "రాళ్ళు లేవు, ఏమీలేవు. నేను చెబుతున్నాను కదమ్మా పిచ్చితల్లీ! ఎందుకు ఏడుస్తావు. ఏమీకాదు! సాయినాధుడు నీ అండన వున్నాడు

ఆయనను గట్టిగా పట్టుకో అన్నారు". బాబాను నేను గట్టిగానే పట్టుకున్నాను స్వామి. రోజూ పూజిస్తున్నాను స్వామి. అనగా "ఊపిరితిత్తులల్లో రాళ్ళులేవు, ఏమీలేవు అని అన్నారు". అక్కడ సత్సంగానికి వెళ్ళండి. ఊదీ తెచ్చి వ్రాయండి అన్నారు. అమ్మా ఇక్కడకు రావాలంటే 500 కి.మీ. ఇప్పుడేం వస్తారు, అక్కడ లక్ష్మిగారింటికి వెళ్ళి "తీర్థం తెచ్చి, ఊదీ తెచ్చి త్రాగే వాటిల్లో, తినే వాటిల్లో అన్నింటిలో వేసి ఇవ్వండి. ఏం అమ్మా? ఇస్తున్నారా? అనడిగారు" వారు ఇస్తున్నాం స్వామీ అన్నారు. అక్కడకు రావాలనుందంటే? అమ్మా "గొలగమూడికి జంగిల్ బాబాగారు, శిష్యులతో వస్తున్నారు. అప్పుడే నేను కూడా వస్తున్నాను. అప్పుడు అక్కడకు వద్దురుగానీ! ఇప్పుడు లక్ష్మి ఇంటికి వెళ్ళి తెచ్చుకోండి" స్వామీ మీ చరిత్ర మా దగ్గర వుంది అనగానే ఫోన్ పెట్టేశారు. స్వామీ ఓదార్చిన విధానం, ఆయన ప్రేమపూర్వకమయిన, వాత్సల్యపూరితమైన లాలనకు ఆమె ఎంతో ఊరట పడ్డారు. కన్న తండ్రిలాగా మాట్లాడారట.

11.00 గంటలకు కొంచెం, జ్వరం తగ్గింది. 12 గంటలకు గ్లూకోజ్ నీళ్ళు, రొట్టె ఇచ్చారు. అవి తీసుకొని, చలితో రగ్గుకప్పుకొని సాయంత్రం 6 గంటల వరకూ పడుకొన్నారు. 6 గంటలకు వారేలేచి ఆశ్చర్యంతో ఇదేంటి నా కీళ్ళ వాపులు, నొప్పులు ఏమీలేవు ఏమయ్యాయి? జ్వరం తగ్గిపోయింది, అని ఎంతో ఆనందంగా చెప్పారు. **వారి కాళ్ళు, చేతులు ఆ స్థితిలో ఏ వాపు నొప్పి లేకుండా వుండడం పదకొండు సంవత్సరాల తరువాత, మళ్ళీ ఇదే మొదటిసారి.** ఆ రోజు సాయంత్రం నుండీ పాలు, కాఫీ అన్ని రకాల కూరలూ తీసుకోవడం మొదలు పెట్టారు.

స్వామీ హోమియో మాత్ర వేయమన్నారు కదా! కానీ ఇప్పుడు స్వామి కృప వలన తగ్గిపోయింది కదా! ఇక వేయడమెందుకు అని అనుకున్నారు. లక్ష్మిగారిని అడిగారు. స్వామి వేయమన్నారు కదా వేస్తే సరి అన్నారట. అప్పుడు వారు ఇప్పుడేం లేదు కదా? దేనికని వేస్తాము?



వేయమంటారా? అని అడిగారట. అప్పుడు లక్ష్మిగారు సరే మళ్ళీ ఏమైనా వస్తే వేయండి అన్నారట.

అప్పటి నుండి పూర్తి స్వస్థులయినారు. కొంచెం బలహీనంగా వుండడం తప్ప ఏ విధమైన వాపులు, నొప్పుల భాదలు లేవు. 2002, ఫిబ్రవరి 6వ తేదిన ఎడమకాలు మోకాలు దగ్గర, పాదం దగ్గర కొంచెం నొప్పి మొదలయింది. అప్పుడు స్వామి చెప్పారు కదా! హోమియో మందు ఇప్పించమని అని గురువారం జంగారెడ్డి గూడెం వెళ్ళి 15 రోజులకు మందు తెచ్చుకున్నారు. కొంచెం నొప్పితగ్గింది. వారి పై అత్యంత భక్తి శ్రద్ధలతో పారాయణ, పూజలు, ప్రదక్షణలు చేస్తున్నారు. సత్సంగంలో పాల్గొంటున్నారు.

## దమ్మపేట - ఖమ్మంపాటి వేణు ఇలా వ్రాస్తున్నారు:

నాకు మహనీయులన్నా, దేవుళ్ళన్నా నమ్మకముండేదికాదు. 2003 సంవత్సరము, జనవరి నుండి బాగా దగ్గుగావుండడం వల్ల రాజమండ్రి, సత్తుపల్లి, ఏలూరు, విజయవాడ, పాల్వంచలలోని డాక్టర్లు, మందులు ఎన్ని వాడినా ఏమాత్రం తగ్గడం లేదు. పది నెలలు జరిగిపోయింది. మా బంధువు ఒకామె "ఇంత ప్రయత్నిస్తున్నావు మౌనబోధ అనే పుస్తకం 40 రోజులు చదివి శ్రీ వెంకయ్య స్వామి వారి దర్శనానికి వస్తాను, నా బాధ నివారించమని మొక్కు చెప్పుకోమన్నది". సరేనని మౌనబోధ పారాయణ 25 రోజులు చేయగానే మాగ్రామస్తులు గొలగమూడి వెళ్తుంటే నేను నా భార్య వెళ్తున్నాము. అందరూ ముందు దర్గాస్వామివారి దగ్గరకు వెళ్ళి తర్వాత గొలగమూడి పోదామని తీర్మానించి అలా వెళ్ళాము. అక్కడకు వెళ్ళి శ్రీస్వామి ముందు కూర్చొని నా ఆరోగ్యం బాగాలేదు స్వామీ అని చెప్పగానే "నీకు చెస్ట్ దగ్గర నొప్పిగా ఉంది. ఊపిరితిత్తుల్లో నీరుదగ్గు

ఉంది. అదేమిచేయదులే. రోజూ రాగిరొట్టె తిను అని తయారు చేసే పద్ధతికూడా వారే చెప్పారు". అప్పటి నుండి రాగిరొట్టె తింటున్నాను.

అదేమి చిత్రమోగాని పోయేటప్పుడు మా రెండు సంచులూ నా భార్యే మోసుకొచ్చింది. కానీ తిరుగు ప్రయాణంలో ఆ రెండు సంచులూ నేనే మోసుకొచ్చాను. కాళ్ళ నొప్పులు, చేతులు నొప్పులు, చెస్ట్ నొప్పి ఎలా పోయాయో తెలియదు. అంతా శ్రీ స్వామివారి అనుగ్రహం. అది మొదలు మహనీయులు, దేవుడు మందిరం అంటే నమ్మకమేర్పడి నిత్యం మందిరానికి వెళ్ళడం, పారాయణ చేయడం లాంటి మంచి మార్గంలో నడుస్తున్నాను.

### దమ్మపేట - సూర్య చంద్రారావు గారు ఇలా వ్రాస్తున్నారు:

శ్రీ దర్గాస్వామి వారు సుబ్రహ్మణ్యం స్వామిగా దర్శనమివ్వటం. సద్గురువు సర్వదేవతా స్వరూపం గదా. నేను శ్రీ దర్గాస్వామి వారిని దర్శించాను గాని వారు నాకే దేవతగాను దర్శనమివ్వలేదే అనుకునే వాణ్ణి. శ్రీ దర్గాస్వామి వారి నుండివచ్చిన రెండవ రోజున శ్రీ స్వామివారు ఒక కొండ మీద గల పెద్ద బండమీద కూర్చొనియున్నారు. నేను చూస్తుండగనే పది శిరస్సులు గల సుబ్రహ్మణ్యం స్వామిగా మారిపోయారు. చాలా స్పష్టంగా చూస్తున్నాను. ఆ విషయం తలచుకుంటేనే వళ్ళు జలదరిస్తుంది. నాకు చిన్నప్పటి నుండి శ్రీ సుబ్రహ్మణ్యంస్వామి అంటే ఎనలేని ప్రీతి. నా ప్రీతిననుసరించి శ్రీ దర్గాస్వామి వారు నాకు అలా దర్శనమిచ్చి నేను సద్గురువునని నాకు నమ్మకం కల్గించారు.



### G. R. K. సాయి సుబ్రహ్మణ్యం:

శ్రీ దర్గాస్వామిని దర్శించినపుడు "ఒరేయ్ నీ మీద బండ పడబోతుంది. జాగ్రత్తగా సాయిని వదలకుండా పట్టుకోరా" అని చెప్పారు. బాగా ఆరోగ్యంగా ఉన్న నాకు ఆ మాట ఎందుకు చెపుతున్నారో తెలియలేదు. వారు చెప్పినట్లుగానే నాలుగు నెలలలో పెద్ద అనారోగ్యమే వచ్చింది. బెంగుళూరులో స్పృహలేకుండా పడిపోయాను. మా కంపెనీ డాక్టరులేరు. ఒక గంట A.C. రూంలో ఉంచి పంపేశారు. నాకు స్పృహవచ్చింది. మా నాన్న గారికి ఫోన్ 3 మార్లు చేసినా అందలేదు. శ్రీ దర్గాస్వామి వారికి ఫోన్ చేసినా అందలేదు. ఇక లాభం లేదని గొలగమూడి వచ్చేశాము. సమయానికి మా అమ్మ నాతో ఉండబట్టి సరిపోయింది. లేకుంటే నేను మానసికంగా చాలా బాధపడేవాడిని. గొలగమూడి శ్రీ వెంకయ్యస్వామి వారి సన్నిధిలో ఉంటూ డాక్టర్ల మందులు వాడుతున్నాను. Ph.D. కూడా రెండు సంవత్సరాలు పూర్తయింది. నేనడగకుండానే నాకు రాబోయే అనారోగ్యాన్ని గురించి చెప్పడమే గాక అదృశ్యంగా ఎంతో మేలు చేకూర్చిన శ్రీ స్వామివారికి అనంతకోటి కృతజ్ఞతాభి వందనములు చెల్లిస్తూ మమ్ములనెప్పుడు ఇలాగే వదలక రక్షించమని వేడుకొంటున్నాను.

### దమ్మపేట గ్రామం - రవిగారి తల్లిగారు ఇలా వ్రాస్తున్నారు:

మా బంధువులు మోసం చేసి మా ఆస్తి అంతా హస్తగతం చేసుకొన్నారు. నా బిడ్డలు వారి రాక్షసత్వానికి బలియైనారు. చదువురాని నేను మానసిక వత్తిడులకు, విపరీతమైన అనారోగ్య బాధలకు గురి అయ్యాను. ఆస్తిపోవుటచే నా కొమార్తె వివాహం చేయలేక పోయాము. నాకు పిచ్చి పట్టిందని, చనిపోతానని అందరూ తలచారు. ఇంట్లో ఎవ్వరూ అన్నం తినడంలేదు. మేము చేసే ప్రార్ధనలకు అంతేలేదు.

ఒక రాత్రి ఆజానబాహుడు, బొజ్జగల్గి, నుదుట నామాలు ధరించిన వారు పద్మాసనంలో కూర్చొని కనిపించి ఎందుకమ్మా బాధపడుతావు. నేనున్నానుగా అని ఎంతో ప్రేమగా, లాలనగా ఓదార్చారు. మీరు ధర్మంగా మంచిగా ఉండండని చాలాసేపు ఓదార్చారు. కేవలం ఈ కల ప్రభావం వలన తెల్లవారే సరికి ఎంతో ధైర్యం వచ్చి అంతా వారు చూసుకుంటారు అనే భావంతో 90% కోలుకోవడం గొప్ప వింత. ఆ స్వప్నంలో నన్ను ఓదార్చిన వ్యక్తి ఇలా ఉన్నారని చెపితే వారు అక్కల్‌కోటస్వామి అని నా కొమార్తె పుస్తకంలోని వారి బొమ్మ చూపించింది. అచ్చం అలాగే ఉన్నారు.

కొన్నాళ్ళ తర్వాత మా స్థలంలో మా బంధువులు షాపులు కట్టించి ఇతరులకు అమ్మేశారు. వారు మరొకరికి అమ్మేశారు. మరలా నాకు బాధ మొదలైంది. నేను శ్రీ వెంకయ్య స్వామివారిని తలచుకొని "స్వామీ! వారికి డబ్బు బలం ఉంది గనుక మీరేమీ చేయలేకున్నారా" అని నిష్టూరాలాడాను. నిద్రపట్టి స్వప్నం వచ్చింది. స్వప్నంలో శ్రీ దర్గా స్వామి వారు మా ఇంటికి వచ్చి తృప్తిగా భోంచేశారు. "నేనెప్పుడూ నీకు తోడుగా ఉంటాను. నీవు దేనికీ కంగారు పడవద్దు" అని వెళ్ళిపోతున్నారు. వెంటనే శ్రీ దర్గాస్వామి వారు కాస్త షిరిడీ సాయి అయ్యారు. ఈ విషయం అరుగో బాబా అంటూ ఇంట్లో అందరినీ దర్శించుకోమంటున్నాను. తర్వాత శివపార్వతులు, విష్ణుమూర్తి, లక్ష్మీదేవి, మూడుముఖాలతో శ్రీ దత్తాత్రేయ స్వామి దర్శనమిచ్చి స్వప్నం అదృశ్యమైయింది.

ఈ విధంగా నడి సముద్రంలో ఉన్న నన్ను శ్రీ దర్గాస్వామి వారు, దత్తుని రూపాలైన ఇతర మహాత్ములూ తన రూపమేనని చెప్పడం ద్వారా భేదభావం మాని దైవం ఒక్కరేననే నిరంతరఎరుక పోగొట్టుకోకుండా జీవించండని శ్రీ స్వామివారు బోధిస్తున్నారు.



**తొండెపురాజు:**

27-8-94 నేను శ్రీ స్వామివారి దర్శనానికి వెళ్ళినపుడు స్వామి "ఏరా నాకురోజూ పాలు పోస్తావా?" అని అన్నారు. నేను పోస్తాను స్వామీ అన్నాను. శ్రీ స్వామి వారు "నీవు పాలు పోయవురా. నీళ్ళే పోస్తావు" అని అన్నారు. నేను ఇంటికి వెళ్ళిన రోజు నుండి రోజూ ఒక గ్లాసు పాలు శ్రీ స్వామి వారికి నైవేద్యం పెట్టేవాడిని. అలా రెండు సంవత్సరాలు చేసి తర్వాత అశ్రద్ధ వలన మానేశాను. నేను శ్రీ స్వామి వారి వద్దకొస్తూనే "ఏరా నాకు పాలు పోయట్లేదు. నీళ్ళే పోస్తున్నావు గదా" అన్నారు. 27-8-94 శ్రీ స్వామి వారన్న మాట మరల రెండు సంవత్సరాల తర్వాత మరలా ఖచ్చితంగా అదే అన్నారు. ఇంతటి సర్వజ్ఞమూర్తిని మనతో ఉంచుకొని కూడా మనం సత్యం, ధర్మం, సంపనత్వం, సాధారణత్వం, సద్గురుసేవ చేయకుండా జీవితాలను వ్యర్థంచేసుకోవడం ఎంత అవివేకమో కదా!

**తొండెపురాజు - దమ్మపేట - ఖమ్మంజిల్లా:**

శ్రీ దర్గాస్వామి వారి దర్శనార్థం వెళ్ళిన మా గ్రామస్తులందరూ శ్రీ స్వామి వారికి నమస్కరించుకొని వారి నివాసం నుండి బయటకు వచ్చారు. నేనొక్కడినే వెనుకబడి పోయాను. ఈలోగా శ్రీ స్వామి వారు కాలుమీద కాలు వేసుకొని మెట్టు పై కూర్చున్నారు. వారు రెండు కాళ్ళు భూమి మీద ఉంటే పాదాలకు నమస్కరించుకోవాలని కోరుకొంటు వెళ్ళి వెనుక నిలుచొని యున్నాను. వారు రెండు కాళ్ళు భూమి మీదపెట్టికూర్చొని "ఇప్పుడు నమస్కరించుకో" అని అన్నారు. నా మనసులోని పవిత్రకోరికను అలా తీర్చారు.

అందరమూ బయటిగేటు వరకు వచ్చేశాము. నేను, శ్రీ నాగేశ్వరరావు మాష్టరుగారు "శ్రీ స్వామి వారి నివాస గృహం వరకు

వెళ్ళాము, కానీ వారు ప్రసాదమివ్వకుండానే పంపారే" అని అనుకుంటూన్నాము. వెంటనే వారు గేటు వరకు వెళ్ళినవారిని వెనక్కు పిలచి ఆపిల్ పండు ముక్కలు చేసి ఇస్తూ "ఏం ప్రసాదం పెట్టకుండా పంపేస్తున్నానని అనుకుంటున్నారా?" ఇదిగో ప్రసాదమని ఇచ్చారు. ఆ మహనీయుల సర్వజ్ఞత్వం అడుగడుగునా కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. మనమెక్కడ ఉండి ఏమి చేసినా, ఏమి ఆలోచించినా, ఏమి మాట్లాడినా వారికి తెలుస్తుందని నిరంతరము గుర్తెరిగి నడుచు కుంటుంటే వారి అండ మనకెప్పుడూ ఉంటుంది.

నేనొకప్పుడు కరెంటు పనిచేస్తూ కరెంటు స్థంభం నుండి గోతిలో పడ్డాను. అప్పుడు వచ్చిన నడుంనొప్పి తగ్గనే లేదు. పని చేసినా, పడుకున్నా విపరీతమైన నొప్పివచ్చేది. ఒక రోజు శ్రీ స్వామి వారికి చెప్పాను. శ్రీవారు తన దండంతో మెడ నుండి నడుం వరకు తాకి నా వీపున దండంతో తట్టారు. ఆనాటి నుండి ఈ రోజు వరకు నడుంనొప్పి మరలా రాలేదు. ఎంత పని చేసిన, బరువులు పట్టినా నొప్పిలేదు. సంకల్ప మాత్రంతో సాటి జీవులు బాధలు తీర్చే కరుణామయులకు కృతజ్ఞతలు ఎలా తెల్పాలో తెలియడంలేదు.

### తొండెపు రాజుగారు శ్రీ దర్గాస్వామి వారితో తన ప్రథమ అనుభవం ఇలా వ్రాస్తున్నారు:

శ్రీమతి లక్ష్మిఆంటీ, శ్రీ నాగేశ్వరరావు మాష్టర్‌గారు మొదలగు వారితో శ్రీ దర్గాస్వామి వారి దర్శనానికి వెళ్ళాము. కొందరు శ్రీ దర్గాస్వామి వారు గొప్ప మహనీయులంటే మరికొందరు కాదంటున్నారు. అందరము కలసి ఆ రాత్రికి ఒక నిర్ణయానికి వచ్చాము. "మనమంతా శ్రీ మాష్టారి మార్గంలో ఉన్నాము. మనం అడగకుండానే శ్రీ దర్గా స్వామివారు మీరు శ్రీ భరద్వాజ మార్గంలో ఉన్నారని" చెపితే వారు మహనీయులని



నమ్మాలనుకున్నాము. తెల్లవారి అందరికీ తీర్ధమిస్తూ నేను వచ్చినప్పుడు నీకేమి కావాలని మూడు మార్లు అడిగినా నేను నాకేమీ వద్దని మూడు మార్లు అలానే చెప్పాను. ఒక వైపు సాయి బాబా మరియొక వైపు శ్రీ మాష్టరుగారు ఉన్న ఫోటో నా జేబులోనుండి వారే తీసుకొని ఆ ఫోటోను చూపిస్తూ "ఈయన మార్గంలో నడుస్తున్నాను అని కావాలి కదా? ఇంకేమీ అవసరంలేదుకదా" అన్నారు. నేను మా గ్రూపు అదే కోరుకున్నాము గనుక వారు నిజమైన మహాత్ములని రూఢి అయింది.

నేను లౌకిక విషయాలేవీ వారిని అడగలేదు. వారు నా దగ్గరున్న అవధూత లీల గ్రంధం తీసి ఒక చోట తెరిచారు. అక్కడ వెంకమ్మగారికి మామిడి పండుకు పుండుపుడితే అది ఓర్చుకుంటే ఎంత ఫలింపు వస్తుందని చెప్పే ఘట్టం వచ్చింది. ఈ ఘట్టం నిత్యం చదవమన్నారు. ఇదే విధంగా నాకు అనేక ఇబ్బందులు వచ్చాయి. ఏడురోజులు ఒంగోలులో ఉన్నాను. క్రమంగా అన్నీ సర్దుకున్నాయి. శ్రీ దర్గాస్వామి వారు అవధూత లీల గ్రంధం తెరిచి చదవమన్న ఘట్టం నా జీవితంలో యధాతధంగా జరిగిపోయింది.

### దర్గా స్వామి తన చిన్నతనం గూర్చి చెప్పిన విషయాలు:

దర్గా స్వామి వాళ్ళ అమ్మగారు ఉదయం 5 గంటలకు స్వామిని లేపి, స్వామి చేత ఏదో ప్రార్ధన చేయించేవారు. (అదేమిటో సరిగా గుర్తులేదు) తరువాత తెల్లవారాక, "శ్రీ సూర్యనారాయణా, వేదపారాయణా, లోకరక్షాయణా......" అని చదువుతూ ఉండేవారు. సాయంత్రం పూట (ఒక కాయ పేరు చెప్పారు గుర్తులేదు) ఒక కాయకు సూదితో కన్నం పెట్టి అందులో గుజ్జు తీసివేసి, వత్తిపెట్టి, నూనె పోసి, దీపం వెలిగించి, ఆ దీపం మీదుగా ఆంజనేయ స్వామిని చూస్తూ ధ్యానం చేసేవారు. అలాచేస్తే వాళ్ళ అమ్మగారు రోజూ ఒక గోధుమ రొట్టె, నెయ్యి ఇంకా కొన్ని చెప్పి, అవి పెడతానని చెప్పేవారు. చిన్నప్పుడు వాటి మీద

ఇష్టం వల్ల అలా చేయడం మొదలు పెట్టాను. ఐదవ సంవత్సరం వచ్చేటప్పటికే రామాయణం, భారతం, భాగవతం చదవడం పూర్తి అయిపోయింది. సత్యహరిశ్చంద్ర నాటకం కూడా అప్పటికే చూశాను. బడి చదువులు ఆ తరువాత ప్రారంభం అయ్యాయి. రెండు ఆంగ్ల పుస్తకాల పేర్లు చెప్పి, 6వ సంవత్సరంలో బడిలో చేరిన తర్వాత అవి చదివానని చెప్పారు.

**సాయిబాబాను పూజించడం గురించి స్వామి చెప్పినవి:**

నా దగ్గర చిన్నప్పుడు, ఒక సాయిబాబా పటం చిన్నది ఉండేది. దానికి పైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల బొమ్మలు ఆ పటంలో ఉండేవి. నేను ఎప్పుడూ ఆ పటంనే చూస్తుండేవాణ్ణి. మా అమ్మగారికి ఆఖరి రోజులు వచ్చినప్పుడు, ఆమెనాతో, "ఇక నా రోజులు అయిపోతున్నాయి. నువ్వుగానీ, మీ గురువు సాయిబాబా గానీ నన్ను రక్షించలేరు" అని అన్నారు. ఆమె అన్నట్లుగానే కొద్దిరోజులలో చనిపోయారు. అప్పటి నుంచి నాకు సాయిబాబాకు మధ్య మాటలేదు. ఆయనది సుమారు ఒక అడుగు విగ్రహం ఉండేది. దానిని చూపుతోనే పగలగొట్టాలని చూస్తూ ఉన్నాను. ఆ తర్వాత బాబాయే నాలోపల నుంచి ఇలా చెప్పారు, "ఎందుకు నాపై కోపం పెట్టుకుంటావు? నేను మీ అమ్మను రక్షించలేదని ఎందుకు బాధ పడతావు?" తనను రక్షించమని మీ తల్లి నన్ను అడుగలేదు. నీవు కూడా ఆమెను బ్రతికించమని అడుగలేదు. ఆమె వచ్చిన పని పూర్తయిపోయింది కాబట్టి ఆమెను తీసుకు వెళ్ళాను" అని చెప్పారు. అప్పటి నుండి బాబాతో మరలా మాములుగా ఇంతకు ముందువలెనే ఉండేవాడిని.

నా చిన్నప్పుడు నాకు ఏమైనా కావలసివస్తే, మట్టితో సూదులు చేసేవాడిని. (స్వామి చెప్పింది సరిగా అర్థం కాలేదు) వాటితో సాయిని సాధించి సంపాదించుకునే వాడిని.



**తమ భౌతిక గురువును గురించి స్వామి చెప్పినవి:**

"నాకు ఇంతకు ముందటి ఋణాను బంధం వలన ఆ భౌతిక గురువు లభ్యమయ్యారు. ఆయన తమ పాదాలను నా గుండెల పై పెట్టారు. నుదుటి పై ముద్దు పెట్టుకున్నారు. శరీరమంతా తవిడారు."

ఆ తరువాత స్వామి ఎక్కడికో వెళ్ళి వచ్చేటప్పటికి, ఆయన గురువు వేరొక చోటికి వెళ్ళిపోయారు. అప్పుడు స్వామి ఎంతో బాధపడుతుంటే వాళ్ళ గురువుగారు నేను ఎక్కడలేను అని ఆయనకు ఆత్మబోధగా చెప్పారు. వారికి గురువుగారు ఉర్దులో వ్రాసిన ఆరు ఆకులు (సరిగా అర్థం కాలేదు) ఇచ్చారు. అవి ఎవరికి అర్థంకావు. అవి అరిషడ్వర్గాలకు గుర్తు. ఈ దర్గాల వద్దకు వచ్చేటప్పటికి ఐదు పోయాయి. ఇక చివరిది  మత్సరం మిగిలినది. మత్సరం అంటే నేను, నాది అనే భావం. ఇక్కడకు వచ్చాక అది కూడ పోయింది.

**అమ్మయ్యగారి గురించి, స్వామి చెప్పినవి:**

**వివాహం:**

1951 December లో స్వామివారికి పెళ్ళి చూపులు జరిగాయి. అమ్మయ్యగారు స్వామికి వరుసకు మేనరికం అవుతారు. స్వామి వాళ్ళ అమ్మగారు ఆమెను చేసుకోమని స్వామికి చెప్పారు. తరువాత సాయిబాబా ధ్యానంలో కనిపించి "నీవు ఆ అమ్మాయిని వివాహం చేసుకో. ఆమె ఆంజనేయిని అంశ" అని చెప్పారు. తర్వాత పెళ్ళి చూపులకు వెళ్ళారు. పెళ్ళిచూపులు అయినాక, అమ్మయ్యగారు అదేపనిగా ఏడుస్తున్నారు. అప్పుడు స్వామి వాళ్ళ అమ్మగారు. "ఎందుకమ్మా ఏడుస్తున్నావు"? అని అడిగితే, "మా అవ్వ, తాత నన్ను చాకారు. వాళ్ళు పెళ్ళిచూపులకు రాలేకపోయారు" అని చెప్పారు. అప్పుడు స్వామి అమ్మగారు, "దానికోసం

ఏడవడం ఎందుకు. ఇక్కడకు అయితే మీ అవ్వ, తాత మాత్రమే వస్తారు. మిగిలిన బంధువులు చూడడం కుదరదు. నేను మా వాడిని నీతో పంపిస్తాను. మీ అవ్వ వాళ్ళ ఊరు తీసుకవెళ్ళు. అప్పుడు అక్కడున్న మీ వాళ్ళందరూ చూడవచ్చు" అని చెప్పి స్వామి వారిని అమ్మయ్యగారితో పంపించారు. వివాహం కాకముందే వధువరులను పరాయి గ్రామం పంపడం చాలా గొప్ప గదా!

కాబోయే వధూవరులు - వివాహంకాక ముందే మరొక గ్రామం పోవడమునకు పెద్దలు అనుమతించడం ఎంతగొప్ప సంస్కారమో ఆలోచించండి. వారు అనుమతించినా వీరు తమ శీలాన్ని కాపాడుకున్న పవిత్ర మూర్తులు.

వివాహం అయిన తరువాత అమ్మయ్యగారితో దర్గాస్వామి వాళ్ళ నాన్నగారు, "అమ్మా మా వాడికి నీతో వివాహం కాకుంటే ఈ పాటికి ఏ అడవిలో ఏ పుట్టక్రింద తపస్సులో ఉండేవాడో? మాకు దక్కేవాడు కాదు. 1948 లో గాంధీ మహాత్ముడు మరణించినపుడు, మహాత్ముల జీవితాల గురించి ఆలోచిస్తూ స్మశానాలలోనే కాలం గడిపేవాడు" అని చెప్పారు. అప్పుడు అమ్మయ్యగారు, "ఇప్పుడిక మనకు అలాంటి భయం లేదు. ఆయనకు సద్గురువు దొరికారు. సరైన సాధనా మార్గం లభించింది." అని చెప్పారు.

ఒకప్పుడు దర్గాల వద్ద ఒక గర్భవతి అయిన ఆమె వచ్చి ఉంటుండేది. ఆమెకు కలగబోయే బిడ్డకు జ్ఞానాన్ని ప్రసాదించి, తమ తదనంతరం ఆశ్రమ విషయాలు ఆ బిడ్డకు అప్పగించాలని అమ్మయ్యగారు తలచారు. ఈ సంకల్పంతో అమ్మయ్యగారు ఒక రొట్టెను తయారు చేసారు. ప్రహ్లాదుడికి గర్భంలోవుండగానే నారాయణ జపం వలన జ్ఞానం కల్గినట్లు, ఆ గర్భవతిచే ఈ రొట్టె తినిపించడం ద్వారా,



ఆమె కడుపులో ఉన్న బాబుకు జ్ఞానం ప్రసాదించాలని అమ్మయ్యగారు సంకల్పించారు. ఆ రొట్టె ఆమెకు ఇవ్వాలని దానిని ఒక కవరులో చుట్టి, దాని పై ఇంకొక కవరుతొడిగి, దాని పై మరలా ఒక కాగితం చుట్టి, బొడ్డులో దోపుకునే డబ్బుల సంచిలో పెట్టుకున్నారు. ఇందంతా చూస్తూ ఉన్న స్వామివారు, నవ్వుతూ ఏమిటి అని అడుగగా అమ్మగారు వివరించారు. అప్పుడు  స్వామి నవ్వుతూ అలా నీవు అనుకున్నట్లు ఏమీ జరుగదు. దానిని నీ నుండి కడప స్వామి తీసుకుని తింటారు. కావలిస్తే చూడు అన్నారు. అప్పుడు వారు ప్రయాణంలో ఉండి కొద్దిసేపటికి కడపలో దిగారు. ఎక్కడి నుంచి వచ్చారో తెలియదుగాని, దిగిన వెంటనే కడప స్వామి వచ్చి, దోపుకున్న సంచి పట్టుకుని విడువలేదు. అప్పుడు అమ్మయ్యగారు దర్గాస్వామి వారి వైపు చూడగా ఆయన పక పక నవ్వుతూ నీవు ఆ రొట్టె ఆయనకు ఇవ్వక తప్పదు. లేకుంటే ఆయన ఇక్కడ నుండి కదలరు అని చెప్పగా, అమ్మగారు ఆ రొట్టె కడప స్వామి వారికి ఇచ్చేసారు. ఆయన ఆ రొట్టె తిని వెళ్ళి పోయారు. దీని గురించి దర్గస్వామి చెబుతూ "కడపస్వామి అలా రొట్టెను స్వీకరించి, మాకు జ్ఞానాన్ని ప్రసాదించారు" అని అన్నారు.

మనం తినే ఆహారం హృదయపూర్వకమైన నామస్మరణతో తయారు చేస్తే ఆ ఆహారం తిన్నవారికి భక్తిశ్రద్ధలు అబ్బుతాయని, సత్వగుణం వృద్ధి యగుతుందన్నది ఒకటవ సందేశం. నామస్మరణతో చేసిన ఆహారమంటే భగవంతునికెంతో ఇష్టము. దానిని ప్రీతితో స్వీకరిస్తారని ఈ లీల తెలుపుతుంది. అలాచేసి అందరము తరిద్దాము.

ఆ తరువాత కొంత కాలానికి, ఆ గర్భవతికి బాబు పుట్టాడు. ఆ బాబును అమ్మయ్యగారే పెంచారు. స్నానం చేయించడం మొదలు అన్నీ అమ్మయ్య గారే స్వయంగా చేసేవారు. 10వ తరగతి వరకూ చదువు చెప్పించారు. బి.కాం. కూడా చదివించి అప్పుడు స్వామివారే చీటీ రాసి

ఇచ్చి బాంక్‌లో ఉద్యోగం వేయించారు. కొన్నాళ్ళకు అతను తన తల్లిదండ్రుల వద్దకు వెళ్ళిపోతానని చెప్పి, ఆశ్రమం నుండి వెళ్ళిపోయాడు. అతను లౌకికమైన విషయాలలో పడిపోయాడుగానీ, ఎంత చెప్పినా సరే, అదృష్టంలేక పరమార్థిక జ్ఞానం అబ్బలేదు.

దర్గాస్వామి ఈ మధ్య నెల్లూరు వచ్చినపుడు, అతను స్వామి ఆశ్రమానికి వచ్చి మధ్యాహ్నం వరకూ అక్కడ ఉండి, చూచి వెళ్ళిపోయాడట. అతడు ఆశ్రమాన్ని చూసి, "ఈ ఆశ్రమం ఇంతకు ముందుకంటే బాగా వృద్ధి అయింది" అన్నాడట.

### "ఈ ప్రదేశం ఎందరో మహాత్ములకు పుట్టినిల్లు" అంటూ స్వామి చెప్పిన వివరాలు:

ఉరుసు ఉత్సవానికి దర్గాల దగ్గరకు ఎక్కడ నుండో ఒక మహాత్ముడు వచ్చాడు. అప్పుడు స్వామి, "వేరేచోట్ల ఉరుసు ఉత్సవం ఎంతో ఆడంబరంగా జరుగుతూ ఉంటే మీరు ఇక్కడకు ఎందుకు వచ్చారు?" అని అడిగారు. అప్పుడామహాత్ముడు "అక్కడ ఎంతో ఆర్భాటంగా జరుగుతుంది గానీ అక్కడ వెలుగులేదు. ఇక్కడ ఆ వెలుగు ఉండటం వలన ఇక్కడకు వచ్చాను" అని చెప్పారు. "ఆ మహాత్ములే నన్ను నిర్భయుణ్ణి చేసారు" అని చెప్పారు.

ఇలాంటి ఉత్సవాలలో భగవంతుని మెప్పించేది భక్తి, శ్రద్ధ (వెలుగు) కాని అట్టహాసం కాదు  అని ఆ మహనీయుడు బోధిస్తున్నాడు. సాధ్యమైనంత సేపు - భక్తులందరు పారాయణ ధ్యానము, నామస్మరణ, భజనలు చేయాలని అదీ శ్రద్ధాభక్తులతో చేయాలని ఆ మహనీయుని ద్వారా భగవంతుడు మనకు బోధిస్తున్నాడు.



అలానే మరొక అవధూత ఒకామె దర్గాల వద్దకు వచ్చి ఉంటుండేవారు. స్వామి ఒక పూజారిని పిలిచి ఆమెకు అన్నం పెట్టమని చెప్పారు. అతడు స్వామి మాటకాదనలేక అలానే తీసుకు వెళ్ళాడు. అప్పుడామె, "అందరి వద్దా అడుక్కుని నాకు తెచ్చావు. అదైనా అన్నయ్య తెమ్మన్నాడని తెచ్చావు కదూ"! అన్నారట. అతడు స్వామి వద్దకు వెళ్ళి ఈ విషయం చెప్పగా, "ఆమె అన్నదాంట్లో తప్పేమీ లేదు. నీవు పూజారివి. అందరి వద్ద అడిగి తీసుకుంటూ ఉంటావు. అలానే నేను చెప్పడం వల్లనే కదా నీవు ఆమె వద్దకు పోయావు. లేకుంటే వెళ్ళేవాడివి కాదు కదా!" అన్నారు.

### ఒక మంత్రగాడి విషయమై దర్గాస్వామి చెప్పిన వివరాలు:

ఒకసారి ఒక మంత్రగాడు దర్గాల వద్దకు వచ్చి, స్వామి చేతి మీద సర్పంతో కాటువేయించాడు. అప్పటి నుంచి స్వామి తనవద్దకు వచ్చిన వారి ప్రశ్నలకు సమాధానం చెబుతూ, మిగిలిన సమయంలో స్పృహలేకుండా పడిపోయేవారు. అతడు గర్వంతో చుట్టు ప్రక్కల ఉన్న ఊళ్ళ నుండి వెడుతూ, తనకు ఎదురు పడ్డ వాళ్ళతో, "నేను స్వామిని పడగొట్టేశాను. ఇక ఆయన లేవరు" అని గర్వంగా చెప్పుకుంటూ వెళ్ళిపోయాడు. అది విన్న వారు ఆత్రంగా స్వామిని చూడడానికి దర్గాల వద్దకు వెళ్ళేటప్పటికి ఆయన దర్జాగా కాలు మీద కాలు వేసుకుని మాట్లాడుతూ ఉన్నాడు. ఆ మంత్రగాడు స్వామిని ఏమీ చెయ్యలేక పోయాడు.

### తన కొడుక్కి తాగుడు మాన్పించమని వచ్చిన ఆమెతో స్వామి చెప్పినవి:

మేము స్వామి వద్ద ఉండగా, ఒక తల్లి, కొడుకు, కోడలు స్వామి వద్దకు వచ్చి, అతను రోజూ రెండు సీసాలు మందు తాగుతాడని, ఆతని

త్రాగుడు మాన్పించమని కోరారు. దానికి స్వామి, ఆ త్రాగుడు మానాలి అనుకున్న వ్యక్తే తమ వద్దకొస్తే రోజూ దర్గాల వద్ద తీర్థం ఇస్తాము. అది తీసుకుంటే త్రాగుడు క్రమంగా పోతుంది. కానీ ఒకసారి తీర్థం తీసుకున్నాక మరలా త్రాగితే వాంతులు, భేదులు అవుతాయి. దానికి సిద్ధపడితేనే రమ్మను లేకుంటే వద్దు అని చెప్పి పంపించి వేసారు.

**సుబ్బరామయ్యగారు మిమ్ములను అడిగి కొన్ని విషయాలు తెలుసుకోమన్నారు అంటే స్వామి వారు క్రింది విధంగా అన్నారు:**

"నా గురించి చెప్పుకోవడానికి ఏముంది. అసలు నేను ఎవరు? who am I ? నేను అంటే ఈ కాళ్ళు, చేతులు, కన్ను, ముక్కు ఉన్న శరీరమా? ఏ మహాత్ముడైనా తన గురించి తాను చెప్పుకోడు. ఆ సద్గురువే నాలో ఉండి ఆడిస్తున్నాడు. ఇంతకు ముందు ఎవరైనా తన దగ్గర ఏమైనా పెట్టుకుంటే వాళ్ళను ఆ సద్గురువే నా వద్దకు పంపుతున్నాడు. ఆయనే నా ద్వారా వారికి చెబుతున్నాడు. నా గురించి చెప్పుకోడానికి ఏమీలేదు. I am his servant."

**వేరు వేరు సందర్భాలలో స్వామి చెప్పినవి:**

(1) గురువు అంటే డబ్బులిచ్చి సంతలో కొనుక్కునే వస్తువు కాదు. అలా అయితే అందరూ కోటి రూపాయిలు ఇచ్చి కొనుక్కుని, చంకలో పెట్టుకు తిరుగుతారు. గురువు నిరంతరం మనలోనే ఉండి నిరంతరం అంతర్వాణి ద్వారా చెబుతూ ఉంటారు. పాలు చేతిలో పట్టుకుని వెన్నకోసం తిరగడంలా ఉంటుంది గురువుకోసం వెతకడం.

ఒకతను నోటిలో సిగరెట్టు పెట్టుకుని, చేతిలో దీపం పట్టుకుని, అగ్గిపెట్టికోసం నాలాంటి ముసలతని దగ్గరికి వచ్చి అగ్గిపెట్టి



అడుగుతున్నాడట. అప్పుడా ముసలతను, నీ చేతిలో ఉన్న దీపంతో వెలిగించుకో అని చెప్పాడట. గురువు కోసం వెతకడం అలా ఉంటుంది.

(2) శ్రీ వెంకటేశ్వర వజ్రకవచం సాయంత్రం ఆరతి తరువాత చదివిస్తున్నారు. అందులో "కార్య కారణం" అని వచ్చింది. అంటే ఏమిటి? అని అడిగి స్వామి వారే ఇలా చెప్పారు.

**"కార్యం అంటే - కుండ కారణం అంటే - మట్టి**

మట్టితోనే కుండ చేయబడింది. అలానే ఈ దేహంలో పరమాత్మ ప్రాణ రూపంలో ఉండటం వల్లనే ఇది ఇట్లా ఉంది. అది పోతే శరీరం కుళ్ళిపోయి రెండు రోజలకి తీసి అవతల పారెయ్యమంటారు. ఆ పరమాత్మే మనలోపల ఉండి మనలను ఇలా నడిపిస్తున్నాడని ఎప్పుడూ గుర్తు పెట్టుకొని అహంకరించకుండా ఉంటే, ఆయనే మనకు కవచమై మనలను ఎల్లప్పుడూ రక్షిస్తాడు. అది వెంకటేశ్వర వజ్రకవచం" అని చెప్పారు.

(3) "ఇంకొక అరగంటలో సత్సంగం అయిపోతుంది" అని స్వామి వారి సేవకుడు ఒకతను అంటే స్వామివారు, "మనమెప్పుడూ సత్సంగంలోనే ఉంటాము. సత్ అంటే అంతటినీ నడిపించేది. అది లేకుంటే, ముల్లు ఊడిపోతే తక్కెడ ఎలా పడిపోతుందో మన శరీరం అలానే పడిపోతుంది. మనమెప్పుడూ సత్సంగంలోనే ఉంటాము" అన్నారు.

(4) భగవంతుడిని ప్రతిష్ఠించ వలసినది మందిరాలలో కాదు. మన హృదయంలో ప్రతిష్ఠించు కోవాలి. సాయిబాబా చరిత్రగానీ, భగవద్గీతగానీ, భాగవతంగానీ, దత్తాత్రేయ స్వామి చరిత్రగానీ, తాజుద్దీన్ బాబాగానీ, రామకిృష్ణపరమహంస గానీ, లేక ఏ ఇతర మహాత్ముల చరిత్ర చదివినా అందులో చెప్పబడిన గుణాలను మనంపొందే ప్రయత్నం చెయ్యాలి.

(5) భగవద్గీతలో విద్యార్థికి వుండవలసిన లక్షణాలు:

1. మితాహారం 2. మితభాషణం 3. మితనిద్ర

(6) "నీలో ఆడే ప్రాణశక్తే ఇందులోనూ (నాలోనూ) ఉంది. సత్యమైన జీవిత విధానం ఉండాలి. భగవంతుడు మనకు ఒక రూపాయి ఇచ్చాడు. దానిని సరిగా ఉపయోగించుకోవడమా లేక పాడుచేసుకోవడమా అనేది మన చేతులలోనే ఉంది. మనందరినీ భగవంతుడు ఒక్కొక్క పని మీద భూమి మీదకు పంపాడు. మన లోపల ఆ పరమాత్మే ఉండి మనలను ఆడిస్తాడు. ఈ విషయం మరచి అహంకరించకూడదు".

## స్వామివారు తన తండ్రిగారికి సద్గతి ప్రసాదించడం:

మా నాన్నగారు 23 రోజులలో చనిపోతారనగా, మా తమ్ముని దగ్గర 10 రూపాయిలు తీసుకుని ఆయనకు ఇచ్చాను. ఇలా పితృఋణం తీర్చుకున్నాను. అప్పటి నుండి ఆయనను నా బిడ్డగా చేసుకుని జ్ఞానం ఉపదేశించాను. 20 రోజులలో ఆయనకు జ్ఞానం కలిగింది. అప్పుడు నేను ఉత్తరాభిముఖంగా పద్మాసనం వేసుకుని కూర్చుంటే ఆయన నా ఒడిలో తల పెట్టుకుని ప్రాణం విడిచారు.

## శ్రీ శ్రీ శ్రీ దర్గాస్వామి వారు స్వయంగా చెప్పిన లీల:

నీలకంఠరావు పేటలో ఒక ముస్లిం కుర్రవానికి చాలా కాలంగా మాటలు లేవు. వాళ్ళొచ్చి శ్రీ స్వామివారిని ప్రార్థించారు. శ్రీ స్వామి వారు అతని నాలుక పై వ్రాశారు. అతనికి మాటలు వచ్చాయి. ఈ విషయం అచ్చటి ముస్లిములు నమ్మలేదు. ఆ కోమటాయన వచ్చి నాలుక మీద వ్రాస్తే మాట వచ్చిందా? అది వట్టిదేనన్నారు. కొద్ది రోజుల తర్వాత సమాదుల దగ్గర ఏదో కార్యక్రమం జరుపుతుంటే ఆ మాటలు వచ్చిన ముస్లిము మరికొందరు మిత్రులతో అక్కడపనిచేశాడు. పని పూర్తయిన తర్వాత అక్కడ చేతులు, ముఖము కడుక్కునే నీళ్ళు లేవు. అక్కడొక గుంటలో మూరెడు లోతు నీళ్ళున్నాయి. కానీ దానిలో కంప ముండ్లు పడి



ఆకురాలి బాగా పురుగులు పట్టి ఉన్నాయి. శ్రీ స్వామి వారికా సంగతి చెప్పారు. పురుగులు లేవు ఏమీలేవు పోయి ఆ ముండ్లు తీసేసి కడుక్కోమన్నారు. వారు వెళ్ళి ముళ్ళు తీసేసి పై నీళ్ళు అలా చల్లేశారు. పరిశుభ్రమైన నీళ్ళు ఉన్నాయి. వాళ్ళ కాళ్ళుచేతులు ముఖం కడుక్కోవడమేగాక కడుపార నీరుత్రాగి వెళ్ళారు. మహనీయుల సంకల్ప బలమంటే ఏమిటో ఆ ముస్లిములకు తెలిసిందోలేదోమరి.

## శ్రీ శ్రీ శ్రీ దర్గా స్వామి వారు స్వయంగా చెప్పారు:

నేను దర్గాల దగ్గరకు వెళ్ళేటప్పుడు సాంబ్రాణి కడ్డీలు తీసుకు వెళ్ళాను. అప్పటికి దర్గాలలోని మహనీయులు పైన నాకు ఎలాంటి పూజ్యభావం లేదు. మీలో శక్తి వుంటే ఈ కడ్డీలు వెలిగించే మార్గం చూపండి అని చెప్పుకున్నాను. మరుక్షణంలోనే అక్కడ ఒక అగ్గి పుల్ల, అగ్గి పెట్టకు ప్రక్కనుండే చెక్కు నాకంట పడ్డాయి. వాటితో సాంబ్రాణి కడ్డీలు వెలిగించాను. రెండవ సారి వూరకనే వెళ్ళి నమస్కరించి వచ్చాను. మూడవ సారి వెళ్ళి అక్కడే వుండసాగాను. పదిహేను రోజులు కేవలం నీళ్ళతోనే జీవించాను.

శ్రీ స్వామివారు షోడింజర్‌లో ఉండేటప్పుడు ఒక రోజు అమ్మయ్యగారు సమాదుల దగ్గర హారతిస్తున్నారు. అప్పుడొక దుర్మార్గుడు ఆమెకు హాని చేసే తలంపుతో ఆమె నుండి పది అడుగుల దూరం వరకు వచ్చాడు. సమాదులలో ఉండే ఒక స్వామివారు ఆ దుర్మార్గుని చెంపమీద కొట్టడంతో అతడు క్రిందపడి దబేల్‌మని శబ్దమైంది. ఈ శబ్దం ఏమిట అని అమ్మయ్యగారు వెనక్కు తిరిగి చూచారు. అప్పుడతడు లేచి పరుగెత్తి పోతున్నాడు. అది మొదలు ఎవ్వరూ ఇలాంటి దుష్టతలంపులతో ఆ నిర్జన ప్రదేశంలోకి వచ్చేవారు కాదు. ఆ విధంగా ఆ సమాదులలోని మహనీయులు వారిని అనుక్షణం కాపాడుతున్నారు. అప్పుడు అమ్మయ్యగారి వయసు ఇరవై సంవత్సరములుంటాయి.

## మా ఇతర ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1. | వార్తా లాపము | 150 రూ\|\| |
| 2. | అవధూత లీల - అరవం | 50 రూ\|\| |
| 3. | శ్రీ వెంకయ్య స్వామి - అరవం, చిన్న పుస్తకం | 5 రూ\|\| |
| 4. | అవధూత లీల - శ్రీ వెంకయ్య స్వామి వారి చరిత్ర నిత్య పారాయణ గ్రంథము, తెలుగు | 40 రూ\|\| |
| 5. | అవధూత లీల - ఇంగ్లీషు | 30 రూ\|\| |
| 6. | శ్రీ వెంకయ్య స్వామి - ఇంగ్లీషు, చిన్న పుస్తకం | 5 రూ\|\| |
| 7. | శ్రీ ధునీవాలా దాదా చరిత్ర | 15 రూ\|\| |
| 8. | అవధూత బోధామృతము - శ్రీ స్వామి వారి బోధలు | 15 రూ\|\| |
| 9. | శ్రీ స్వామి సన్నిధి - శ్రీ స్వామివారి సేవకుల అనుభవాలు | 15 రూ\|\| |
| 10. | శ్రీ శివనేశన్ స్వామీజీ దివ్య చరితము | 12 రూ\|\| |
| 11. | శ్రీ బూర్లె రంగన్న బాబుగారి దివ్య చరిత్ర | 8 రూ\|\| |
| 12. | శ్రీ పూండి స్వామి వారి దివ్య చరిత్ర | 2 రూ\|\| |
| 13. | మౌన బోధ | 1 రూ\|\| |
| 14. | పిలచిన పలికే దైవం | 1 రూ\|\| |
| 15. | ధర్మమూర్తి | 1 రూ\|\| |
| 16. | బోధ యజ్ఞాయ నమః | 1 రూ\|\| |
| 17. | దివ్య లీలలు | 1 రూ\|\| |
| 18. | శ్రీ వెంకయ్య స్వామి వారి పూజ | 1 రూ\|\| |
| 19. | శ్రీ స్వామి కృప | 1 రూ\|\| |
| 20. | శ్రీ స్వామి వారి భజన పాటలు | 1 రూ\|\| |
| 21. | నమ్మలేని పచ్చిసత్యాలు | 1 రూ\|\| |
| 22. | ఆచార్య భరద్వాజ గారి సత్‌సంగము | ఉచితము |
| 23. | శ్రీ మాష్టారి మంచిమాట - శ్రీ E.భరద్వాజ గారి దివ్యవాణి | ఉచితము |
| 24. | శ్రీ భరద్వాజ గారితో భక్తుల అనుభవాలు | ఉచితము |
| 25. | శ్రీ జ్ఞానేశ్వర్ మహరాజ్ చరిత్ర | ఉచితము |
| 26. | మృత్యువు పై ఘనవిజయము | ఉచితము |
| 27. | మన ధర్మము - కర్తవ్యము | ఉచితము |
| 28. | శ్రీ సుధీంద్ర బాబు గారు | ఉచితము |
| 29. | స్మృతిమాత్ర ప్రసన్నాయ నమః | ఉచితము |
| 30. | స్మృతిరహిత ప్రసన్నాయ నమః | ఉచితము |
| 31. | శుద్ద చైతన్యమే తానైన పూజ్య శ్రీ భరద్వాజ మాష్టార్ గారు | ఉచితము |
| 32. | అమృత వాక్కులు | ఉచితము |
| 33. | జ్ఞానేశ్వరి భగవద్గీత | 210 రూ\|\| |

**దర్గాస్వామి దగ్గరకు బస్సు మార్గము:**

కడప నుండి రాయచోటి మార్గములో నడిచే బస్సు ఎక్కి నీలకంఠరావు పేట - దర్గాస్వామి దగ్గరకు అని చెప్పి దిగాలి.